తీన్మార్
నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక
విలేకరులు కావలెను
పత్రిక రంగంలో మరో సంచలనం, వినూత్న రీతిలో వెలుబడతూ విశేష ప్రజాదరణ పొందుతున్న
తీన్మార్ తెలుగు దిన పత్రిక
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలలో పని చేయుటకు
జిల్లా బ్యూరో చీఫ్ లు, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు,
జిల్లా క్రైమ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.
ఆసక్తి కలిగిన వారు సంప్రదించగలరు
అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత,
కొత్త వారికి అవకాశం ఇవ్వబడును.
ఈ క్రింది నెంబర్ల ను ఫోన్ ద్వారా లేదా వాట్సప్ ద్వారా సంప్రదించగలరు
9177108128, 9966847463

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

teenmaardesk@gmail.com

for e-paper scan now

ములుగు | సంపుటి : 02 | సంచిక : 301 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 14 ఫిబ్రవరి 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.



# సుదీర్ఘ నిరసనకు సిద్ధమైన రైతులు

2 లో..

ఆరు నెలలకు సరిపడా నిత్యావసరాల సమకూర్పు

దిల్లీలో భారీ నిరసనకు అన్నదాత సన్నద్ధం

శంభు సరిహద్దు వద్ద ఉద్రిక్తత

రైతులపై బాష్పవాయువు ప్రయోగం

రాజధాని సరిహద్దుల్లో భారీ ట్రాఫిక్‌జామ్

తమ డిమాండ్లను నెరవేర్చుకునే లక్ష్యంతో మంగళవారం దేశ రాజధాని ఢిల్లీ దిశగా అన్నదాతలు కదిలారు. ఈ ఉదయం పంజాబ్, హరియాణా నుంచి వేలాదిమంది రైతులు ట్రాక్టర్లతో నగరానికి బయల్దేరారు. ఈ క్రమంలో కొన్ని కీలక విషయాలు వెల్లడయ్యాయి. ఇటీవల వెలుగులోకి వచ్చిన నిఘా నివేదిక ప్రకారం.. ఒక్క పంజాబ్నుంచే వందల సంఖ్యలో ట్రాక్టర్లు, వాహనాలు బయల్దేరతాయని, వాటిలో అన్నదాతలు ఆరు నెలలకు సరిపడా ఆహారం, ఇతర సామగ్రిని తీసుకువస్తారని తెలిపింది.

## తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు స్థానికులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పనకే

పొరుగు రాష్ట్రం వ్యక్తి నియామకం పట్ల ఎమ్మెల్సీ కవిత అభ్యంతరం వ్యక్తం



2

## ప్రధాని మోడీ తెచ్చిన నల్ల చట్టాలతో రైతులకు మోసం

కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి



2

## మేడారం జాతరకు ముమ్మరమైన ఆర్టిసీ సేవలు

2

మేడారంలో అతిపెద్ద ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం ఏర్పాటు

రాష్ట్రంలోని 9 రీజియన్ల నుంచి భారీగా నడపనున్న బస్సులు

జాతరకు 35 లక్షలకు పైగా భక్తులను తరలించాలని ఆర్టీసీ లక్ష్యం

జాతర సందర్భంగా విధుల్లో ఉండనున్న 14వేల మంది ఆర్టీసీ సిబ్బంది





## తెలంగాణలో జరిగిన అతి పెద్ద కుంభకోణం కాళేశ్వరం ప్రాజెక్ట్

అధిక వడ్డీతో ప్రజల్ని

తాకట్టు పెట్టారని మంత్రి ఆగ్రహం వ్యక్తం

త్వరలోనే మేడిగడ్డపై అసెంబ్లీలో

శ్వేత పత్రం విడుదల చేస్తాం

రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

.. వివరాలు 2లో

## సీఎం రేవంత్‌రెడ్డి మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శన పొలిటికల్ డ్రామానే

ఆరోపించిన తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



2

## ఆకాశవాణిలో స్మృతి ఇరానీతో తన ప్రయాణాన్ని పంచుకున్న ప్రెసిడెంట్ ముర్ము

ప్రపంచ రేడియో దినోత్సవంలో రాష్ట్రపతి భవన్‌లో ప్రత్యేక ఎపిసోడ్






## లోక్ సభ ఎన్నికల వ్యూహామే.. "ఛలో నల్గొండ" సభ..?

నల్గొండలో పూరించిన పోరు శంఖారావం

కరెంట్ సమస్యలను పరిష్కరించాలి, లేదంటే

వెంటాడుతామంటూ సభలో కేసీఆర్ సవాల్

.. వివరాలు 2లో

## ఎప్పుడో కాళేశ్వరం వెళ్లి నివేదిక ఇచ్చాక మళ్ళీ కాళేశ్వరం ఎందుకు

కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణ ఎందుకు కోరడం లేదు

కృష్ణా నీటి పేరుతో బీఆర్ఎస్, కాళేశ్వరం పేరుతో కాంగ్రెస్ డ్రామాలాడుతోంన్నాయని విమర్శలు

కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డ బీజేపీ ఎంపీ బండిసంజయ్



2

# సుదీర్ఘ నిరసనకు సిద్ధమైన రైతులు



తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 13 (తీన్మార్ న్యూస్): తమ డిమాండ్లను నెరవేర్చుకునే లక్ష్యంతో మంగళవారం దేశ రాజధాని దిల్లీ దిశగా అన్నదాతలు కదిలారు. ఈ ఉదయం పంజాబ్, హరియాణా నుంచి వేలాదిమంది రైతులు ట్రాక్టర్లతో నగరానికి బయల్దేరారు. ఈ క్రమంలో కొన్ని కీలక విషయాలు వెల్లడయ్యాయి. ఇటీవల వెలుగులోకి వచ్చిన నిఘా నివేదిక ప్రకారం.. ఒక్క పంజాబ్నుంచే వందల సంఖ్యలో ట్రాక్టర్లు, వాహనాలు బయల్దేరతాయని, వాటిలో అన్నదాతలు ఆరు నెలలకు సరిపడా ఆహారం, ఇతర సామగ్రిని తీసుకువస్తారని తెలిపింది. కొందరు రైతులు మీడియాతో మాట్లాడుతూ ఇదే విషయాన్ని వెల్లడించారు. ప్రభుత్వం, పోలీసులు తమ సహనానికి పరీక్ష పెట్టినా డిమాండ్లు నెరవేరేవరకు నిరసన కొనసాగిస్తామన్నారు. 'సుత్తి, రాళ్లను పగలకొట్టే పరికరాలతో సహా కావాల్సినవన్నీ మా ట్రాలీల్లో ఉన్నాయి. ఆరు నెలలకు సరిపడా రేషన్, డీజిల్‌తో మేం మా ప్రాంతాల నుంచి బయలుదేరాం' అని ఓ రైతు మీడియాకు వెల్లడించారు. ఆయన రెండు ట్రాలీల్లో సామగ్రిని తీసుకొని పంజాబ్‌లోని గురుదాస్‌పుర్ నుంచి దేశ రాజధానికి వస్తున్నారు. తమ యాత్రను భగ్నం చేసేందుకు ట్రాక్టర్లకు డీజిల్ దొరక్కుండా చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపించారు. 2020-21లో ఉద్యమించిన రైతులు పలువురు ప్రస్తుత ఆందోళనలో పాల్గొంటున్నారు. అప్పట్లో వారు కొన్ని నెలల పాటు దిల్లీలో చలిని లెక్క చేయకుండా నిరసన చేపట్టారు. హామీ ఇచ్చినట్టుగా కేంద్రం తమ డిమాండ్లను నెరవేర్చలేదని, ఇప్పుడు వాటిని సాధించుకున్నాకే తిరిగి వెనక్కివెళతామని వారు స్పష్టంచేశారు. కాగా రైతులు తలపెట్టిన మెగా మార్చ్‌లో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. పంజాబ్, హరియాణా మధ్య ఉన్న శంభు సరిహద్దు వద్దకు భారీ సంఖ్యలో వచ్చిన రైతులపై పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారు. దిల్లీ దిశగా కదులుతున్న వారిని అడ్డుకునేందుకు ఈ చర్యలు తీసుకున్నారు. దీంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. బాష్పవాయువు ప్రయోగంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. అలాగే బలగాలు డ్రోన్లతో స్మోక్ బాంబ్స్‌ను జారవిడిచారు. దీంతో నిరసనకారులు, మీడియా ప్రతినిధులు పరుగులుపెట్టినట్లు తెలుస్తోంది. ఆందోళనకారులు వారి ప్రణాళిక ప్రకారం 'దిల్లీ చలో' మార్చ్‌ను ప్రారంభించారు. ఈ క్రమంలోనే పంజాబ్-హరియాణా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన బారికేడ్లను వారు బద్దలుకొట్టేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు వారిని అడ్డుకునేందుకు టియర్‌గ్యాస్ ప్రయోగించినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ఉదయం 10 గంటలకు పంజాబ్‌లోని ఫతేగఢ్ సాహిబ్ నుంచి వేలాదిమంది రైతులు ట్రాక్టర్లతో దిల్లీ కి బయల్దేరారు. అటు సంగ్రూర్ నుంచి మరో బృందం కూడా ఇంద్రప్రస్థ దిశగా కదిలింది. ఈ సందర్భంగా కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ జనరల్ సెక్రటరీ శర్వాణ్ సింగ్ పంధేర్ మాట్లాడుతూ.. "మేం బారికేడ్లను బద్దలుకొట్టాలనుకోవడం లేదు. చర్చలతోనే మా సమస్యను పరిష్కరించుకోవాలని భావిస్తున్నాం. కానీ, వారు (కేంద్రం) మాకు ఏ విధంగా సాయం చేయట్లేదు. తప్పనిసరి పరిస్థితుల్లోనే ర్యాలీ మొదలుపెట్టాం. రోడ్లను బ్లాక్ చేస్తామని మేం చెప్పలేదు. ప్రభుత్వమే అలా చేస్తోంది. పంజాబ్, హరియాణా సరిహద్దులు అంతర్జాతీయ సరిహద్దుల్లా కన్పిస్తున్నాయి" అని అన్నారు. రైతుల ఆందోళనను భగ్నం చేసేందుకు పోలీసులు అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. నగర సరిహద్దుల్లో భారీగా బలగాలను మోహరించారు. రహదారులపై బహుళ అంచెల్లో బారికేడ్లు ఏర్పాటుచేశారు. పలు చోట్ల కాంక్రీట్ బ్లాక్స్, ఇనుప కంచెలు, మేకులను అడ్డుగా పెట్టారు. దిల్లీ అంతటా నెల రోజుల పాటు 144 సెక్షన్ విధించారు. ముందు జాగ్రత్తగా పార్లమెంట్ సమీపంలో ఉన్న సెంట్రల్ సెక్రటేరియట్ మెట్రో స్టేషన్‌ను మూసివేశారు.సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేయడంతో భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. గాజీపుర్, చిల్లా సరిహద్దుల్లోని హైవేలపై కిలోమీటర్ల మేర వాహనాలు బారులుతీరాయి. ట్రాఫిక్ నెమ్మదిగా కదులుతోంది. కిలోమీటరు దూరానికే గంటకు పైగా సమయం పడుతుండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మరోవైపు, అన్నదాతల ఆందోళనను అడ్డుకునేందుకు కేంద్రం పటిష్ట చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే రైతులను నిర్బంధించేందుకు వీలుగా దిల్లీలోని బావనా ప్రాంతంలో తాత్కాలిక జైలుగా ఏర్పాటు చేయాలని కేంద్రం ప్రతిపాదించింది. దీన్ని దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తోసిపుచ్చారు. రైతన్నలను జైల్లో పెట్టడం సరికాదన్నారు. ఈ ఆందోళనపై కేంద్రం, రైతుల మధ్య సోమవారం అర్ధరాత్రి వరకు జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాల్సిందేనని రైతు నాయకులు చేసిన డిమాండ్‌పై ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో రైతులు ఆందోళన ప్రారంభించారు. ఇదిలా ఉంటే..'దిల్లీ చలో' ఆందోళన ఎలా చేపట్టాలన్న దానిపై రైతు సంఘాలు రిహార్సల్ నిర్వహించాయని, కొందరు రైతులు ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, వ్యవసాయశాఖ మంత్రి అర్జున్ ముండా సహా పలువురు భాజపా సీనియర్ నేతల ఇళ్ల ముందు నిరసన చేపట్టే అవకాశాలున్నాయని ఆ నిఘా నివేదిక పేర్కొన్న సంగతి తెలిసిందే.

## తెలంగాణలో జరిగిన అతి పెద్ద కుంభకోణం కాళేశ్వరం ప్రాజెక్ట్

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో జరిగిన అతి పెద్ద కుంభకోణం కాళేశ్వరం ప్రాజెక్ట్ అని ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. మేడిగడ్డతో పాటు సుందిళ్ల, అన్నారం డ్యామేజీలో ఉన్నాయన్నారు. 94 వేల కోట్ల రూపాయల అప్పు అధిక వడ్డీకి తెచ్చి తెలంగాణ ప్రజల్ని తాకట్టు పెట్టారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కుటుంబం డబ్బులు సంపాదించుకోడానికి కాళేశ్వరం ప్రాజెక్టును వాడుకుందన్నారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోతే కేసీఆర్ ఒక్క మాట మాట్లడలేదు అని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఇక, కృష్ణాజలాల వాటాలో 2014 నుంచి ఎక్కువ అన్యాయం జరిగిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కృష్ణా బ్యాక్ వాటర్ 60 శాతం అక్రమంగా తరలిపోతుంటే కేసీఆర్ సైలెంట్ గా ఉన్నారు అని పేర్కొన్నారు. ఇరిగేషన్ శాఖను కేసీఆర్ ఏటీఎంలా వాడుకున్నారని అంటూ మంత్రి ఆరోపించారు. మేడిగడ్డ ప్రాజెక్టు పిల్లర్లు కుంగిపోయిన.. బ్యారేజీని ఎవరూ చూడకండా పోలీసులను కాపలా పెట్టారని చెప్పారు. ఎమ్మెల్యేలకు అవగాహన కల్పించేందుకే ప్రాజెక్టుల సందర్శన చేపట్టాం.. బీఆర్ఎస్ నేతలు కూడా వచ్చి ప్రాజెక్టులను చూడాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారనే విషయాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. త్వరలోనే మేడిగడ్డపై అసెంబ్లీలో శ్వేత పత్రం విడుదల చేస్తానని ఆయన వెల్లడించారు.

## ఆకాశవాణిలో స్మృతి ఇరానీతో తన ప్రయాణాన్ని పంచుకున్న ప్రెసిడెంట్ ముర్ము

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 13 (తీన్మార్ న్యూస్): ఇండియా ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము నై సోచ్ నై కహానీ- ఎ రేడియో జర్నీ విత్ స్మృతి ముగింపు ఎపిసోడ్‌లో కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీతో ప్రత్యేక ఇంటరాక్షన్‌లో ఒడిశాలోని తన జన్మస్థలమైన రాయరంగపూర్ నుండి రాష్ట్రపతి భవన్‌కు తన ప్రయాణాన్ని పంచుకున్నారు ఆకాశవాణిలో ఇరానీ. మంగళవారం ప్రపంచ రేడియో దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి భవన్‌లో ప్రత్యేక ఎపిసోడ్ రికార్డ్ చేయబడింది మరియు ప్రసారం చేయబడింది. ప్రెసిడెంట్ తన చిన్ననాటి నుండి పబ్లిక్ ఫిగర్ అయ్యే వరకు అనేక అనుభవాలను పంచుకున్నారు. తన పాఠశాల ఉపాధ్యాయుడు తనకు ఇచ్చిన తన పేరు వెనుక ఉన్న కథను ఆమె ప్రేమగా వివరించింది. ప్రెసిడెంట్ ఆమె విద్యా, వృత్తి మరియు రాజకీయ ప్రయాణాన్ని పరిశీలించారు. భారత రాష్ట్రపతిగా ప్రజలతో మమేకమై తన అనుభవాలను పంచుకున్నారు. ప్రెసిడెంట్ ముర్ము తనలాంటి ఒక సాధారణ గిరిజన మహిళ అనేక కష్టాలను అధిగమించి, తన పట్టుదల, అంకితభావం మరియు దృఢ సంకల్పంతో దేశానికి సేవ చేయాలనే తన లక్ష్యాన్ని ఎలా సాధించుకుందో వివరించారు. ఆమె తొలిసారిగా కొత్త పార్లమెంట్‌కు వచ్చిన చారిత్రాత్మకమైన రోజును కూడా రాష్ట్రపతి గుర్తు చేసుకున్నారు, ఆమె ముందు సెంగోల్‌ను తీసుకువెళ్లారు. ఆమె సెంగోల్‌ను సత్యం (సత్య), న్యాయం (న్యాయ), అహింస (అహింస) మరియు విశ్వాసం (ధర్మం) యొక్క చిహ్నంగా అభివర్ణించింది. ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ వంటి పథకాలతో ముందుకు వచ్చినందుకు రాష్ట్రపతి తన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ చొరవ గిరిజన జనాభా, ముఖ్యంగా బలహీన గిరిజన సమూహాల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుంది. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశం కోసం రాష్ట్రపతి తన దృష్టిని కూడా పంచుకున్నారు. ఈ ఎపిసోడ్ ఆకాశవాణి రెయిన్‌బో మొత్తం నెట్‌వర్క్‌లో రాత్రి 7 గంటలకు తిరిగి ప్రసారం చేయబడుతుంది. ఇది ఆకాశవాణి యొక్క అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో కూడా అందుబాటులో ఉంది.

## మేడారం జాతరకు ముమ్మరమైన ఆర్టీసీ సేవలు




తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 13 (తీన్మార్ న్యూస్): ఆసియా కుంభమేలాగా చెప్పబడే సమ్మక్క-సారక్క జాతరకు అంత సిద్ధిమైంది. గత కొద్ది రోజుల నుంచి భక్తులు మేడారం తరలొస్తున్నారు. ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం జాతరకు తెలంగాణ ఆర్టీసీ భారీగా ప్రత్యేక బస్సులు నడుపుతోంది. గత జాతర సమయంలో ఆర్టీసీ 3,845 బస్సులు నడిపి 25 లక్షల మంది భక్తులకు సేవలందించింది. అప్పుడు కరోనా వల్ల భక్తులు ఎక్కువగా రాలేదు. కానీ ఈసారి భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉందని ఆర్టీసీ అంచనా వేస్తోంది. ఇప్పటికే చాలా మంది భక్తులు మేడారం వెళ్లారు. ఈ సారి ఆర్టీసీకి భారీగా గిరాకీ ఉంటుందని భావిస్తున్నారు. మేడారం జాతరకు 35 లక్షలకు పైగా భక్తులను తరలించాలని ఆర్టీసీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. మహిళలుక ఉచిత ప్రయాణం ఉండడంతో భారీగా భక్తులు ఆర్టీసీలో ప్రయాణిస్తారని అంచనా వేస్తున్నారు. భక్తులకు బస్సుల సమస్యలు లేకుండా 6 వేల బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. మేడారంలో ప్రధాన జాతర ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు జరుగుతుంది. ఈ రోజుల్లోనే జాతరకు భక్తులు భారీగా వస్తారు. దీంతో ఆ రోజుల్లో భారీగా ఆర్టీసీ బస్సులు నడపనున్నారు. రాష్ట్రంలోని 9 రీజియన్ల నుంచి భారీగా బస్సులు నడపనున్నారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్□, హైదరాబాద్□, రంగారెడ్డి, ఖమ్మం, ఆదిలాబాద్□, నిజామాబాద్□తో పాటు మహారాష్ట్ర నుంచి బస్సులు నడవనున్నాయి. 51 పాయింట్ల నుంచి ఫిబ్రవరి 18 నుంచి బస్సులు నడపనున్నారు. మేడారంలో అతిపెద్ద ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. 50 నుంచి 60 ఎకరాల్లో తాత్కాలికంగా బస్టాండ్ ఏర్పాటు చేశారు. మేడారం ఆర్టీసీ బేస్ క్యాంపు నుంచి అధికారులు మానిటరింగ్ చేయనున్నారు. మేడారం జాతర సందర్భంగా 14 వేల మంది ఆర్టీసీ సిబ్బంది విధుల్లో పాల్గొనున్నారు. ఉమ్మడి వరంగల్□ నుంచే దాదాపు 2 వేల బస్సులు , గ్రేటర్□ వరంగల్ సిటీలోని మూడు ప్రధాన పాయింట్ల నుంచి, అదే విధంగా ఉమ్మడి కరీంనగర్ నుంచి భారీగా బస్సులు నడపనున్నారు.

## లోక్ సభ ఎన్నికల వ్యూహామే.. "ఛలో నల్గొండ" సభ..?

నల్గొండ, ఫిబ్రవరి 13 (తీన్మార్ న్యూస్): రాబోయే లోక్ సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ వ్యూహాత్మకంగానే అడుగులు వేస్తున్నారు. కొద్ది నెలల క్రితం జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి చెందడం, ఆ ప్రభావం రాబోయే లోక్ సభ ఎన్నికల్లో కనిపించబోతుండడంతో, మరోసారి తెలంగాణలో సెంటిమెంట్ రాజేసి తద్వారా వీలైనన్ని ఎక్కువ ఎంపీ సీట్లను గెలుచుకోవాలనే ఆలోచనతో కెసిఆర్ ఉన్నారు. మన నీళ్లు మన హక్కు పేరుతో నల్గొండలో పోరు శంఖారావం పూరించారు. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ సభలో కెసిఆర్ ప్రసంగిస్తారు. నల్గొండ పట్టణ శివారులో నార్కట్ పల్లి, అద్దంకి హైవేకు ఆనుకుని మర్రిగూడ బైపాస్ లో విశాలమైన స్థలంలో ఈ సభను నిర్వహించబోతున్నారు. నల్గొండ, ఖమ్మం, మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చే విధంగా ఏర్పాట్లు చేశారు. అలాగే వాహనాల పార్కింగ్ కోసం అనువుగా ప్రత్యేక స్థలాలను సిద్ధం చేశారు. సభ ఏర్పాట్లను మాజీ మంత్రి జగదీష్ రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. ఈ సభను సక్సెస్ చేయడం ద్వారా వచ్చే లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు సానుకూలత ఉంటుందని కేసీఆర్ అంచనా వేస్తున్నారు. కాగా మధ్యాహ్నం మొదలైన ఈ సభలో బీఆర్ఎస్ పాలనలో 24 గంటల కరెంట్ సరఫరా అందజేశామని, దద్దమ్మల పాలనలో ఇలాగే ఉంటుందని మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. ఇవాళ కృష్ణా జలాల పరిరక్షణే ధ్యేయంగా నల్లగొండలో నిర్వహించిన బీఆర్ఎస్ సభలో ఆయన మాట్లాడుతూ ప్రజలు తమకు ప్రతిపక్ష హోదాను కట్టబెట్టారని, బిడ్డా.. ఛలో నల్లగొండ సభతో మా పోరు ఆపేది లేదని అన్నారు. దద్దమ్మలకు పాలన చేతకాక 24 గంటల కరెంటును ఇవ్వడం చేతకావట్లేదని ధ్వజమెత్తారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన పుణ్యాన తాము అధికారంలో ఉన్న నాటి కంటే రాష్ట్రంలో నేడు 5,600 మెగావాట్ల ఎక్కువ కరెంట్ ఉత్పత్తి అవుతోందని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రెండు నెలలు గడుస్తున్నా.. రైతులకు ఇంకా రైతుబంధు ఇవ్వలేకపోయారంటూ నిలదీశారు. నీళ్లు, కరెంట్ విషయంలో తాము ప్రజలతో కలిసి ఎక్కడికక్కడ ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. ఆ విషయంలో ఎక్కడా వెనక్కి తగ్గేది లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో కరెంట్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి, లేదంటే వదలం, వెంటాడుతామని మాజీ సీఎం కేసీఆర్ సవాల్ విసిరారు.

## తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు స్థానికులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పనకే

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (తీన్మార్ న్యూస్): కారుణ్య నియామకం కింద తెలంగాణా వాసులకు ఉద్దేశించిన ఉద్యోగాల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారిని నియమించడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె.కవిత అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్ర శాసనమండలిలో ప్రత్యేక ప్రస్తావన సందర్భంగా ఆమె ఈ అంశాన్ని లేవనెత్తారు. ఈ విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ స్థానికులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేందుకే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని, దాని ప్రకారం గత బీఆర్ఎస్ ప్రభుత్వం చట్టాలు కూడా చేసిందన్నారు. అయితే, కొత్త కాంగ్రెస్ హయాంలో, పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు చెందిన ఎ రామిరెడ్డి కుమారుడు ఎ రఘునాథ్ రెడ్డికి పాత ప్రభుత్వ ఉత్తర్వును ఉపయోగించి కారుణ్య ప్రాతిపదికన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ విభాగంలో ఉద్యోగం ఇచ్చారు. రఘునాథ్‌రెడ్డి పాఠశాల విద్యాభ్యాసం అంతా కర్నూల్‌లోనే జరిగిందని, అతను తెలంగాణ వ్యక్తి కాకపోయినప్పటికీ 2007 జూలై 12న ఇచ్చిన జీవోను కోట్ చేస్తూ కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. అప్పటికి రాష్ట్రం కలిసే ఉందని, 2014 తర్వాత మన రాష్ట్ర అవసరాలకు తగ్గట్లుగా ఎన్నో నిబంధనలు మారాయని ఆమె చెప్పారు. అలాంటప్పుడు రఘునాథ్‌రెడ్డికి కంపాషనేట్ అపాయింట్‌మెంట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇది చాలా దారుణమని, తెలంగాణ ప్రాంత బిడ్డలకు ఉద్యోగాల్లో అన్యాయం జరిగితే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు తెలంగాణ బిడ్డల పొట్ట కొట్టొద్దని కోరారు. ఈ సందర్భంగా అక్రమ నియామకం విషయాన్ని లేఖ రూపంలో మండలి చైర్మెన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహా.. ప్రస్తుతం ఉన్న చట్టాల ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. అయితే సమస్యను పరిశీలించి అవసరమైతే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ప్రధాని మోడీ తెచ్చిన నల్ల చట్టాలతో రైతులకు మోసం

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 13 (తీన్మార్ న్యూస్): ప్రధాని మోడీ నల్ల చట్టాలు తెచ్చి రైతులను మోసం చేశారని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి వ్యాఖ్యానించారు. రైతుల ఆందోళనతో వెనక్కి తీసుకుంటున్న అన్నారు కానీ ఇప్పటికీ మూడు పార్లమెంట్ సమావేశాలు జరిగాయన్నారు. కానీ బిల్లులు వెనక్కి తీసుకోలేదని, నల్ల చట్టాలుతో రైతులు భూములు కౌలుకి ఇవ్వాలి అంటా అంటూ ఆయన వ్యాఖ్యానించారు. కౌలుకి ఇచ్చిన తర్వాత పరిస్థితి ఏంటి అనేది తెలియదని కోదండరెడ్డి మండిపడ్డారు. గోదాముల్లో నిల్వలు ఉండొద్దనే చట్టం కూడా ఎత్తేశారని, అదానీ అంబానీకి లాభం చేసే పనిలో మోడీ ఉన్నారని ఆయన విమర్శించారు. నిల్వలు రైతులు, జవాన్లకు అక్కరకు వస్తాయని కాంగ్రెస్ ఆలోచన అని, కానీ ఇప్పుడు దాన్ని ఆపేశారన్నారు. బడా బాబులకు లబ్ధి చేకూర్చేలా మోడీ వ్యవహారం ఉందన్నారు. రైతులు ఏం డిమాండ్ చేస్తున్నారు. కేసులు ఎత్తేయాలి అని ఆయన అన్నారు. మద్దతు ధర ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బ్యాంకుల ద్వారా అప్పులు రైతులకు ఎక్కువ ఇవ్వాలి అని, పంటల భీమా పథకం పక్కన పెట్టారన్నారు. మద్దతు ధర అడిగే విషయంలో రైతుల సలహాలు కూడా తీసుకోవడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. అనంతరం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా మోడీ సర్కారు కి వ్యతిరేకంగా 16వ తేదీన ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులను.. కార్మికులను హత్య చేసేలా ఉన్నాయి నల్ల చట్టాలు అని, అన్ని సంఘాల తో కమిటి వేసుకోవాలన్నారు. పార్టీ తరుపున పీసీసీ తో చర్చిస్తామని, ఇందిరా పార్క్ లో భారీ ఎత్తున ధర్నా చేద్దామన్నారు. రైతులను కాపాడుకోవడానికి అందరం సిద్ధం అవ్వాలని, మంత్రులు కూడా ఇందిరా పార్కు కి వస్తారు ధర్నాలో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. సీపీఐ.. సీపీఎం.. జనసమితి పార్టీ అందరిని కలుపుకుని పోదామన్నారు. నిరసన సక్సెస్ చేసే బాధ్యత కాంగ్రెస్ తీసుకుంటదన్నారు. తర్వాత కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ.. నల్ల చట్టాలు దొడ్డి దారిన అమలు చేసే కుట్ర జరుగుతుందని, ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి బడా బాబులకు లబ్ది చేకూర్చే పనిలో ఉన్నారు బీజేపీ నేతలు అని ఆయన విమర్శించారు. హైదరాబాద్ లో పెద్ద ర్యాలీ చేయాలని, గ్రామీణ రైతులకు కూడా అర్థం అయ్యేలా నిరసన ఉండాలన్నారు. రైతులకు జరిగే నష్టాన్ని వివరించాలన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శన పొలిటికల్ డ్రామానే

హనుమకొండ, ఫిబ్రవరి 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శన ఒక పొలిటికల్ డ్రామా అని కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం హనుమకొండ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుంచి తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రపంచంలో ముందుకు దూసుకెళ్తున్నామని తెలిపారు. 4.5 కోట్ల మంది పేదలకు కేంద్ర ప్రభుత్వం ఇళ్లను కట్టించి ఇచ్చిందని తెలిపారు. మోదీకి దేశ వ్యాప్తంగా అనుకూల వాతావరణం ఏర్పడిందన్నారు. ప్రత్యర్థి కూటములకు బీటలు వారుతున్నాయని చెప్పారు. తెలంగాణలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీ ఎంపీ స్థానాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉన్న స్థానాల్లో కూడా బీజేపీ గెలుస్తుందని చెప్పారు. ప్రజల దృష్టిని మళ్లించడానికే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు డ్రామాలు చేస్తున్నాయని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సమగ్ర దర్యాప్తు జరిపే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు దెబ్బతిన్న వెంటనే గత ఏడాది అక్టోబర్ 22వ తేదీన కేంద్ర జలశక్తి మండలికి లేఖ రాసినట్లు గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు ప్లానింగ్‌లో లోపలున్నాయని కేంద్ర జలశక్తి మండలి రిపోర్ట్ ఇచ్చిందని కిషన్‌రెడ్డి తెలిపారు.

## ఎప్పుడో కాళేశ్వరం వెళ్లి నివేదిక ఇచ్చాక మళ్ళీ కాళేశ్వరం ఎందుకు



కరీంనగర్, ఫిబ్రవరి 13 (తీన్మార్ న్యూస్): మేడిగడ్డ బ్యారేజ్ సందర్శనకు సీఎం రేవంత్ సహా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బయలుదేరి వెళ్లిన విషయం తెలిసిందే. ఈ విషయంపై బీజేపీ ఎంపీ బండిసంజయ్ స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ మళ్లీ కాళేశ్వరం వెళ్లాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. మంత్రులు, ఇంజనీర్లు ఎప్పుడో కాళేశ్వరం వెళ్లి నివేదిక ఇచ్చారు కదా అని అన్నారు. కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణ ఎందుకు కోరడం లేదని నిలదీశారు. కృష్ణా నీటి పేరుతో బీఆర్ఎస్, కాళేశ్వరం పేరుతో కాంగ్రెస్ డ్రామాలాడుతోందని విమర్శించారు. ముక్కు నేలకు రాసి బీఆర్ఎస్ నేతలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలను గాలికొదిలేసినందుకు కాంగ్రెస్ క్షమాపణ కోరాలన్నారు. అసెంబ్లీ విలువైన సమయాన్ని వృధా చేస్తారా అంటూ మండిపడ్డారు. ప్రజలకిచ్చిన హామీలను గాలికొదిలేశారన్నారు. "మేం కొట్లాడుతుంటే, నిధులిస్తుంటే కాంగ్రెస్‌కు ఓట్లేయడం న్యాయమా" అని బండి సంజయ్ వ్యాఖ్యలు చేశారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# మురుగునీటి పరీక్ష ద్వారా వైరస్ అంచనా!

కరోనా మహమ్మారిని పూర్తిగా నిర్మూలించడం ఇప్పట్లో సాధ్యం కాకపోవచ్చని తెలుస్తోంది. థాయ్‌లాండ్ గుహ లోని గబ్బిలాల్లో కరోనాకు చెందిన కొత్తవైరస్ ఉన్నట్టు ఇటీవలనే బయటపడగా, చైనాలో మలేషియన్ పాంగోలిన్స్ (అలుగు)లో జిఎక్స్ పి2వి మ్యుటేడెడ్ వెర్షన్‌పై ప్రయోగాలు జరుగుతుండడం, దీని మరణాల రేటు 100 శాతం ఉన్నట్టు తెలియడం ప్రపంచ దేశాలకు ఆందోళన కలిగిస్తోంది. ఇక మన దేశంలో కరోనా మహమ్మారిని పూర్తిగా నిర్మూలించాలని భారీ ఎత్తున ఒకవంక పరీక్షలు జరుగుతున్నా మరోవంక కరోనాకు చెందిన కొత్త వేరియంట్లు పుట్టుకొస్తున్నాయి. అలాగే వ్యాక్సిన్లు అందిస్తున్నా ఏదో ఒక చోట కేసులు బయటపడుతున్నాయి. ప్రభుత్వం వెల్లడిస్తున్న గణాంకాలు ఒకలా ఉంటే, క్షేత్ర స్థాయిలో డేటా మరోలా ఉంటోంది. వ్యాధికారక బ్యాక్టీరియా, వైరస్ లేదా ప్రోటోజోవా తదితర రోగకారక క్రిముల మూలాలు రోజుల కొలదీ మురుగునీటిలో పొంచి ఉండి మను గడ కొనసాగిస్తుంటాయి. వివిధ రకాల ఈ వ్యాధికారిక క్రిముల గుట్టు కనుగొనడానికి వ్యర్థ జలాల ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ లేదా పర్యావరణ పర్యవేక్షణ ఎంతో దోహదం చేస్తుందని పరిశోధకులు చెబుతున్నారు. ప్రజల నివాస ప్రాంతాల్లో వాడుక నీరుగా ప్రవహించే మురుగు నీటిని ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా పరీక్షిస్తే వీటి వ్యాప్తి ఏ స్థాయిలో ఉందో నికరంగా తెలుస్తుందని పరిశోధకులు సూచిస్తున్నారు. దీనికి పెద్ద ఎత్తున నిధులు వెచ్చించడం కానీ లేబొరేటరీ వంటి భారీ పరికరాల అవసరం కానీ అంతగా ఉండదు. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఈ విధానం ఎంతో మేలు చేస్తుంది. ఈ బ్యాక్టీరియా ఉనికిని లేబొరేటరీ పరీక్షల ద్వారా తెలుసుకోడానికి ముందు ప్రజల వాడుక మురుగు నీటిని పరీక్షిస్తే ఆయా ప్రాంతాల్లో వైరస్ ఉనికి ఏ స్థాయిలో ఉందో ప్రాథమికంగా తెలుస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. పోలియో వైరస్‌ను కనుక్కోడానికి దాదాపు ప్రతి దేశం లోనూ ఇదే పద్ధతిని కొన్ని దశాబ్దాలుగా వినియోగించడం పరిపాటిగా సాగుతోంది. మానవ మలినాల మురుగు నీటి నుంచి పోలియోను కచ్చితంగా కనుక్కోగలిగినప్పుడు ఇతర వ్యాధి కారక బ్యాక్టీరియా లేదా వైరస్‌ను కనుక్కోగలగడం ఏమంత కష్టం కాదని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. సార్క్ కొవిడ్ 2 వైరస్ నుంచి కొత్త వేరియంట్ల వరకు వీటి వ్యాప్తిని కనుక్కోడానికి మురుగు నీటి నమూనాల పరీక్ష ఉపయోగపడుతోందని రెండేళ్ల క్రితమే నిర్ధారణ అయింది. ఉదాహరణకు బెంగళూరులోని టాటా ఇనిస్టిట్యూట్ ఫర్ జెనెటిక్స్ అండ్ సొసైటీ (టిటిఐజిఎస్) చాపకింద నీరులా విస్తరిస్తోన్న ఎక్స్ బిబి. 1.16 ఒమిక్రాన్ వేరియంట్‌ను 2022లో బెంగళూరు నగరంలో కనుగొనగలిగారు. 2022 డిసెంబర్ 25న ఎక్స్ బిబి. 1.16 ఒమిక్రాన్ జన్యుశ్రేణిని దేశంలో కనుగొనగా, 2022 డిసెంబర్ 1 నుంచి 2023 ఏప్రిల్ 8 వరకు 2856 జన్యుశ్రేణుల ద్వారా ఈ వైరస్ మూలాలను పుణె బిజె మెడికల్ కాలేజీకి చెందిన పరిశోధక బృందం కనుగొనగలిగింది. ఆ సంవత్సరం ఫిబ్రవరిలో 9.3 శాతం వరకు ఉన్న ఈ వైరస్ ఏప్రిల్ మొదటి వారానికి 79.17 శాతానికి పెరిగింది.మార్చి నుంచి ఏప్రిల్‌లో 12,591 వరకు ఈ వైరస్ కేసులు పెరగ్గా, రోజువారీ పాజిటివ్ రేటు 4.39% వరకు ఉన్నట్టు ఆర్‌టి పిసిఆర్ పరీక్షల ద్వారా తేలింది.దీనికి భిన్నంగా పర్యావరణ పర్యవేక్షణలో భాగంగా బెంగళూరులోని 28 సూయెజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నుంచి టాటా ఇన్‌స్టిట్యూట్ ఫర్ జెనెటిక్స్ అండ్ సొసైటీ (టిఐజిఎస్) నమూనాలను సేకరించి పరీక్షించింది. దీంతో బెంగళూరు నగరంలో వైరస్ వ్యాప్తి నికరంగా ఏస్థాయిలో ఉందో తేలింది. 28 సూయెజ్ ప్లాంట్ల నుంచి వారానికి ఒకసారి ఒక నమూనా వంతున సేకరించి పరీక్షించారు. మురుగునీటిలో పొంచి ఉన్న వైరస్ ఆర్‌ఎన్‌ఎ పోగులు మార్చి మొదటి నుంచి పెరుగుతూ ఏప్రిల్ 1 నాటికి అత్యంత గరిష్ఠ స్థాయికి చేరాయని బయటపడింది. ఈ స్థాయిలో ప్రతి మిల్లీలీటరు మురుగునీటిలో 80,000 వైరస్ కాపీలు కనిపించడంతో బెంగళూరు నగరం మట్టుకు కొన్ని వేలమంది వైరస్ బాధితులయ్యారని నిర్ధారణ అయింది. తాము మురుగునీటిలో వైరస్‌తాలూకు ఆర్‌ఎన్‌ఎ పోగులు మాత్రమే కనుగొన్నాం తప్ప వైరస్ పోగు కాదని టిఐజిఎస్ డైరెక్టర్ రాకేష్ మిశ్రా వెల్లడించారు. ఒకరికి సోకితే 10 మిలియన్ కాపీలను వ్యాపింప చేస్తారని అంచనాగా చెప్పారు. ప్రతి ప్లాంట్‌లో ప్రాసెస్ చేసిన మురుగునీటి పరిమాణాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఎంత మందికి వైరస్ సోకిందో సులువుగా లెక్కగట్టవచ్చు. దీన్ని బట్టి 2022 జనవరిలో కొవిడ్19 వేవ్ ఉధ్భతంగా వ్యాప్తి చెందడానికి బిఎ. 1,బిఎ. 2 ఒమిక్రాన్ వేరియంట్లు దోహదం చేశాయని పరిశోధకులు వివరించారు. దేశం మొత్తం మీద 2022 మార్చి ఏప్రిల్ మధ్య కాలంలో ఎక్స్ బిబి. 1.16 ఒమిక్రాన్ వ్యాప్తి చాలా జోరుగా సాగింది. బెంగళూరు నగరం మొత్తం మీద ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఉన్నందున, నగరంలో ఏ ప్రాంతంలో వైరస్ బాధితులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారో వైరస్ సంఖ్యను బట్టి చెప్పవచ్చని డాక్టర్ రాకేష్ మిశ్రా చెప్పారు. మురుగునీటి పరీక్ష నగరంలో ఇన్‌ఫెక్షన్ల మౌలిక చిత్రాన్ని చెప్పగలుగుతుంది. దీని బట్టే పౌర పాలనా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయవచ్చు. బయటపడకుండా అంతర్లీనంగా ఏ కొత్త వైరస్ వ్యాపించినా మురుగునీటి పరీక్షతోనే దాని ఉనికి తెలిసిపోతుంది. రోజువారీ పరీక్షలతో నిమిత్తం లేకుండా, లక్షణాలు కనిపించినప్పటికీ పరీక్షలు చేయించుకోడానికి కొందరు వెనుకాడుతుంటారు. పైకి కనిపించని (అసింప్టమేటిక్) లక్షణాలతో కొందరుండగా, కొన్ని లక్షణాలు మాత్రమే కనిపించే (ఒలిగోసింప్టమేటిక్ ) కేసులు కూడా ఉంటున్నాయి. ఈ పరిస్థితుల్లో వ్యర్థ జలాల పరీక్ష అన్నది పర్యావరణ పర్యవేక్షణలో అత్యంత కీలకమైనది. దీనివల్ల ఒనగూడిన పెద్ద ప్రయోజనం ఏమంటే వైరస్ సోకిన వారు పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవడం కానీ, పరీక్ష సౌకర్యాలు కల్పించవలసి రావడం కానీ అక్కర లేదు. అలాగే మురుగునీటిలో ఆర్‌ఎన్‌ఎ పోగుల్ని పరీక్షించడం కూడా సులువే. కరోనా మహమ్మారి ముమ్మరంగా వ్యాపిస్తున్న సమయంలో అభివృద్ధి చెందిన దేశాల పరిశోధకులు వ్యర్థ జలాల పరీక్షల ద్వారా మంకీపాక్స్, ఇన్‌ఫ్లుయెంజా, కలరా వంటి వ్యాధుల ఉనికిని తెలుసుకోగలిగారు. గత ఏడాది నవంబర్‌లో జర్నల్ సైన్స్ ట్రాన్స్‌లేషనల్ మెడిసిన్‌లో ప్రచురించిన పరిశోధన పత్రంలో అమెరికాకు చెందిన పరిశోధకులు డెంగ్యు, మలేరియా, జికా, టైఫాయిడ్ తదితర వైరస్‌లను కనుక్కోడానికి వ్యర్థ జలాల పరీక్షలను ముమ్మరం చేయడం అత్యంత అవసరమని ప్రతిపాదించారు. అయితే అమెరికా, ఐరోపా దేశాల్లో డెంగ్యూ కేసులు అంతగా ఉండవు.

# జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

**– ప్రమాద ప్రదేశాలలో హెచ్చరిక బోర్డ్ లు ఏర్పాటు చేయాలి**

**– పంచాయితీ రాజ్, గ్రామీణభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ**



తాడ్వాయి, ఫిబ్రవరి 13 (తీన్మార్ న్యూస్): మేడారం జాతర కు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని పంచాయితీ రాజ్, గ్రామీణభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. మంగళవారం మంత్రి దనసరి అనసూయ సీతక్క, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డా. ఎ. శరత్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరిష్ తో కలిసి మేడారం హరిత హోటల్ లో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భగా మంత్రి మాట్లాడుతూ మేడారం జాతరకు వివిధ సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, ముఖ్యంగా జంపన్న వాగు పరిసర ప్రాంతాలలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రమాద స్థలాలను



ముందుగానే గుర్తించి హెచ్చరిక బోర్డ్ లను ఏర్పాటు చేయాలని అన్నారు. పారిశుద్ధ్యం, త్రాగునీటి పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. స్టాళ్ళ వద్ద డస్ట్ బిన్ లు ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ప్రపంచానికి తెలిసే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. పార్కింగ్ స్థలాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సైన్ బోర్డులు, ఫ్లడ్ లైట్లు, త్రాగునీరు, టాయిలెట్ తదితర అన్ని చర్యలు చేపట్టాలన్నారు. క్షౌరశాలలో క్షురకులు భక్తుల నుండి అధిక మొత్తం వసూలు చేయకుండా ఒకే మొత్తంను నిర్ణయించాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం కొనసాగాలన్నారు. భక్తులకు చేపడుతున్న సౌకర్యాల కల్పనలో రాజీపడవద్దని, ప్రతి అంశంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అన్నారు. వన దేవతలను దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డా. ఎ. శరత్ మాట్లాడుతూ మేడారం జాతరలో జంపన్న వాగు, చిలకల గుట్ట, అమ్మవార్ల గద్దెల వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జాతర విధులు నిర్వర్తించే సిబ్బంది ఎవరికి కేటాయించిన స్థానాలలో మాత్రమే విధులు నిర్వహించేలా సెక్టోరల్, జోనల్ అధికారులు చూడాలని భక్తులు అమ్మవార్లను దర్శించుకునే సమయంలో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలని అన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, ఉద్దేశ్యంతో తోనే ప్రభుత్వం 105 కోట్ల రూపాయల నిధులు కేటాయించిందని తెలిపారు. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతర ప్రతిష్ట గిరిజన సాంప్రదాయాలకు భంగం కలగకుండా జాతర నిర్వహించడానికి ప్రతి ఒక్క అధికారి సహకరించాలని అన్నారు. జాతరలో విధులు నిర్వర్తించే కార్మికులకు విధులు నిర్వహించే చోటే వసతి భోజన సదుపాయం కల్పించాలని ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని అన్నారు. ఈ జాతరలో సంబంధిత శాఖల ప్రోటోకాల్ అధికారులను ఏర్పాటు చేసే విధంగా చూడాలని జిల్లా ఎస్పీకి కొరారు. జాతర పరిసర గ్రామాలలోని మూగజీవాలకు ఎలాంటి హాని కలవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చుట్టుపక్కల గ్రామాలలోని పశువులకు వ్యాధులు రాకుండా వ్యాక్సినేషన్ పూర్తి చేయడం జరిగిందని వాటికోసం ప్రత్యేకంగా ఆరు క్యాంపులు ఏర్పాటు చేశామని, జంపన్న వాగు లోతట్టు ప్రాంతాలలో ప్రాణ నష్టం జరగకుండా ఉండటానికి గజ ఈతగాలను ఏర్పాటు చేశామని అన్నారు. అమ్మవార్ల దర్శనం కోసం క్యూ లైన్ లో వెళ్లే భక్తులకు త్రాగునీరు అందుబాటులో ఉంటుందని అన్నారు. ఈ జాతరలో వైద్య సేవలు అందించడం కోసం 40 బైక్ అంబులెన్స్ ల ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి శ్రీజ, ఏటూరు నాగారం అదనపు ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డీ, దేవాదాయ శాఖ అధికారి రాజేందర్, ఇంజనీరింగ్ అధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వానరాలకు ఆహారాన్ని అందించిన సబ్ రిజిస్ట్రార్ తస్లీమా

## మూగ జీవాల ఆకలిని తీర్చుదాం



మహబూబాబాద్, ఫిబ్రవరి 13 (తీన్మార్ న్యూస్): ఆకలితో అలమటిస్తున్న కోతులకు (వానరాలకు) ఆహారాన్ని (అరటి పండ్లు) అందించి దాతృత్వం చాటుకున్నారు మానుకోట సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్. నిత్యం ఆకలితో ఉన్న అన్నార్తులకు, యాచకులకు ఆహారాన్ని అందించే సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మూగ జీవాలకు (కోతులకు) అరటి పండ్లు అందించి సహృదయాన్ని చాటుకు న్నారు. తస్లీమా మంగళవారం ఉదయం ఆఫీసు వెళుతున్న సమయంలో మహబూబాబాద్ సమీపంలో ఆహారం దొరకక ఉన్న మూగ జీవాల వేదనను చూసిన తస్లీమా అరటి పండ్లును తెప్పించి స్వయంగా వానరాలకు అందించారు. మూగ జీవాల ఆకలిని తీర్చడం ఎంతో ఆనందంగా ఉందని తస్లీమా అన్నారు. మనుషులకు ఆకలి వేస్తే అడుగుతారని, కానీ నోరు లేని మూగ జీవాలు అడగలేవని, మనమే అర్థం చేసుకొని వాటికి ఆహారాన్ని అందించాలని తస్లీమా తెలిపారు, ప్రకృతి వైరీత్యాలతో చెట్లు లేక కోతులు, పక్షులు ఆహారం దొరకక విలవిలలాడుతున్నాయని, ఆకలితో అలమటిస్తు రోడ్లపై తిరుగుతున్న మూగ జీవాల ఆకలిని తీర్చి మానవత్వం చాటుకోవాలని తస్లీమా కోరారు.

# ఇన్చార్జి ఎంపీడీవో హరిత దేవి కి సన్మానం



రాజపేట, ఫిబ్రవరి 13(తీన్మార్ న్యూస్): రాజాపేట మండల పరిషత్ ఇంచార్జ్ ఎంపీడీవో గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కె. హరిత దేవిని మంగళవారం ఎంఈఎఫ్ రాజాపేట మండల కన్వీనర్, ఇంజ మహేష్ మాదిగ ఘనంగా సన్మానించి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, సీనియర్ అసిస్టెంట్ ఖలీల్ జూనియర్ అసిస్టెంట్, అంకురి విజయ్, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు, రామ్ గొల్ల శ్రీనివాస్ మాదిగ, పి.సమ్మయ్య మాదిగ, కార్యాలయ సిబ్బంది, కవిత, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# చలో నల్లగొండ తరలి వెళ్లిన బిఆర్ఎస్ నాయకులు



**– గరిడేపల్లి మాజీ మండల అధ్యక్షుడు**

**– జోగు అరవింద్ రెడ్డి ఆధ్వర్యంలో**

గరిడేపల్లి, ఫిబ్రవరి 13(తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు తలపెట్టిన చలో నల్లగొండ లో కృష్ణా జలాల నీటి కేబిఆర్ఎంబి కేంద్రం ఆధిపత్యం వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా కేంద్రానికి కృష్ణా జలాలు అప్పగింత పాపం కాంగ్రెస్ దేని టిఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు తెలంగాణ నిర్మాత తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిన వ్యక్తి మరియు హుజూర్నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి నియోజకవర్గ అభివృద్ధి పథంలో నడిపిన ఆయన ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా రైతులకు అన్యాయం జరగకుండా మా పార్టీ తరఫున పోరాటం చేస్తాం పలువురు నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి పొనుగోడు గ్రామ పార్టీ అధ్యక్షుడు చామకూరి అంజి, ఎంపీటీసీ రామ్ సైదులు, మాజీ సర్పంచ్ నన్నేపంగా సైదులు, మాజీ ఉపసర్పంచ్ గంద్ర సైదిరెడ్డి, అందె వెంకటేశ్వర్లు, ఫకీర్, షరీఫ్, రఫీ, పిచ్చయ్య, ఆదిరెడ్డి, సోమిరెడ్డి, చంద్రయ్య, ఉపేందర్, మిత్ర బృందం మరియు అధిక సంఖ్యలో యువకులు తదితరులు పాల్గొన్నారు.

# సినీ హీరో సుమన్ ను సన్మానించి శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి



హన్మకొండ, ఫిబ్రవరి 13 (తీన్మార్ న్యూస్): నాలుగు దశాబ్దాల సినీ దిగ్గజం దాదాపు 700 సినిమాలు 10 భాషల్లో నటించిన సినీ నటుడు కేసరి సుమన్ ను హన్మకొండలో వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, సామాజిక వేత్త ఇ.వి. శ్రీనివాస్ రావు, న్యాయవాది యర్రంశెట్టి రాఘవ రావు, శ్యామల గణేష్ లు పూల మొక్కతో ఆహ్వానించి తిరుమల శాలువతో సత్కరించి భద్రకాళి అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు. మహేందర్ గౌడ్, ధనుంజయ గౌడ్, గుండం శ్రీనివాస్, ప్రమోద్, ప్రనీత్, రవీందర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# అంగన్వాడీ ఉద్యోగుల బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలి

**– ఫిబ్రవరి 16 సమ్మెను జయప్రదం చేయాలి**

**– సి.ఐ.టి.యు.జిల్లా కల్లూరి మల్లేశం**

రాజాపేట, ఫిబ్రవరి 13(తీన్మార్ న్యూస్): గత మూడు నెలలుగా పెండింగ్ లో ఉన్న అంగన్వాడీ ఉద్యోగుల వేతనాలు వెంటనే ఇవ్వాలనీ సి.ఐ.టి.యు.జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 16 సమ్మె జయప్రదం కోరుతూ మంగళవారం రోజున రాజపేట మండలం సి.ఐ.టి.యు. జనరల్ బాడీ సమావేశం అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బూరుగు స్వప్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశం అనంతరం సమ్మె పోస్టర్ ను,నూతన సంవత్సర క్యాలెండర్ ను అవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కల్లూరి మల్లేశం మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారు వారి ఉద్యోగుల వేతనాలపైన మాత్రమే ఆధార పడి జీవనం సాగిస్తున్నారనీ, గతంలో ప్రతినెలా 14 వ తేదీ లోపు వేతానాలు వచ్చే వని వెంటనే ప్రభుత్వం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఐసిడియస్ ను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందని నిధులలో కోత విధిస్తున్నదని విమర్శించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుండి కార్మికులకు నష్టం చేసే విధానాలు అవలంబిస్తున్నదని ఎనిమిది గంటల పని విదానంను పన్నెండు గంటలకు వెసులుబాటు కల్పిస్తూ యాజమాన్యాలకు అనుకూలంగా 29 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చి కార్మికులకు నష్టం చేశారని తెలియజేశారు. మోడీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలు రోజు రోజుకు పెంచుతూ పేదలపై బారాలు మోపుతూ నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16 న, జరిగే దేశ వ్యాప్త కార్మిక సమ్మె ను గ్రామీణ బంద్ నీ జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పసుమిత్ర యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వడ్లకొండ వరలక్ష్మి,మిషన్ భగీరథ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి సంపత్, అంగన్వాడీ యూనియన్ నాయకులు భూలక్ష్మి, శోభ, గౌరమ్మ, సరిత, మిషన్ భగీరథ యూనియన్ మండల అధ్యక్షులు అశోక్, మహేష్, మల్లేష్, సుజాత, తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా సంక్షేమ అధికారిణిగా బాధ్యతలు స్వీకరించిన స్వర్ణలత లెనినా



ములుగు, ఫిబ్రవరి 13 (తీన్మార్ న్యూస్): భద్రాద్రి కొత్తగూడెంలో సీడీపీఓగా విధులు నిర్వర్తిస్తున్న స్వర్ణలత లెనినా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన బదిలీల్లో భాగంగా ములుగు జిల్లా కి విచ్చేసిన ఆమె ప్రస్తుత జిల్లా సంక్షేమ అధికారిణి ఈపీ ప్రేమలత వద్దనుండి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మహిలాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న సీడీపీఓలు, సూపర్వైర్లు మరియు వివిధ విభాగాలైన డీసీపీయూ, సీహెచ్ఎల్, బాల సదనం, సఖిలలో పని చేస్తున్న సిబ్బందిని ప్రస్తుత DWO EP ప్రేమలత నూతన DWO అయిన స్వర్ణలత లెనినకి పరిచయం చేశారు. అనంతరం వారంతా నూతనంగా బాధ్యతలు చేపట్టిన DWO స్వర్ణలత లేనినాకి పుష్ప గుచ్చాలతో స్వాగతం పలికారు.

# ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

**– గ్రామీణ సడక్ బందు ను విజయవంతం చేయాలి**

**– సిఐటియు మండల కన్వీనర్" నీల రామ్మూర్తి పిలుపు**

**– వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ధనుంజయ్ నాయుడు**



నేరేడుచర్ల, ఫిబ్రవరి 13(తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల పట్టణ కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో జరిగిన ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ కింద ప్రభుత్వం కార్మికుల పట్ల వివక్ష చూపుతుందని పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తూ 4 లేబర్ కోడులను తీసుకొని వచ్చిందన్నారు. దేశ సంపదలను అంబానీ, ఆదానీలకు కట్టబెట్టిందన్నారు. ట్రాన్స్పోర్ట్ రంగా కార్మికులపై కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మె మరియు గ్రామీణ సడక్ బందులను విజయవంతం చేయుటకు ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులంతా కలిసికట్టుగా ముందుకు పోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిరికొండ శీను, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ధూళిపాల ధనుంజయ నాయుడు, కొర్రరాజు వెంకట్, ముత్యాల భాస్కర్, కోదాటి సైదులు, మొగిలిచర్ల రుద్రమ్మ, వాసికర్ల జయమ్మ, భాస్కర్ రెడ్డి, నన్నేపంగ శ్రీను, మల్లయ్య, ఎస్కె సయ్యద్, ఏఐ ఎస్ఎఫ్ సిఐటియు ఐఎన్టీయూ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# చలో నల్లగొండకు మాజీ ఎమ్మెల్యే చల్లాతో సభకు బయల్దేరిన పరకాల బిఆర్ఎస్.నాయకులు



పరకాల, ఫిబ్రవరి 13 (తీన్మార్ న్యూస్): కృష్ణా నదిపై శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతలను కేఆర్ఎంబీకి అప్పగించడాన్ని నిరసిస్తూ, ప్రాజెక్టులను KRMB కి అప్పగించడం వల్ల రాష్ట్రానికి జరిగే నష్టాలను ప్రజలకు వివరించడానికి, తెలంగాణ హక్కుల పరిరక్షణ కొరకు బీఆర్ఎస్ అదినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రం నందు తలపెట్టిన భారీ బహిరంగ సభకు మద్దతుగా పరకాల నియోజకవర్గంలోని పరకాల, పరకాల మున్సిపాలిటీ, నడికుడ, ఆత్మకూరు, దామేర, గీసుగొండ, సంగెం మండలాలు మరియు GWMC 15,16,17 డివిజన్ల నుండి బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

# మేడారం జాతర పనులను పరిశీలించిన గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డా. ఎ. శరత్



తాడ్వాయి, ఫిబ్రవరి 13 (తీన్మార్ న్యూస్): మంగళవారం మేడారం జాతర పనులను గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డా. ఎ. శరత్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి పరిశీలించారు. మేడారం అమ్మవార్ల గద్దెల ఆలయ పరిసరాల్లో జాతరకు వచ్చే ముఖ్య అతిథుల కోసం ఏర్పాటుచేసిన కంటైనర్ అతిథి గృహాన్ని పరిశీలించారు. అనంతరం ఆర్టిసి బస్టాండ్ ప్రాంగణాన్ని క్యూ లైన్ లను పరిశీలించి జిల్లా కలెక్టర్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ జాతరకు భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున 60 ఎకరాలలో ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి భక్తుల కోసం టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. గత జాతరలో 40 ఎకరాలలో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేయడం జరిగిందని ఈసారి మాత్రం మరో 20 ఎకరాలను కలుపుకొని 60 ఎకరాలలో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఆరువేల బస్సులను నడపనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, దేవదాయశాఖ అధికారి రాజేందర్, స్థానిక ఎమ్మార్వో రవీందర్, ప్రోటోకాల్ అధికారి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించాలి

**– ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్**



శాయంపేట, ఫిబ్రవరి 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించాలని కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు. మంగళవారం రోజున మండల కేంద్రంలోని పెద్దకొడపాక గ్రామంలో జడ్.పి. హెచ్.ఎస్ హైస్కూల్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించే వారన్నారు. 2014 సంవత్సరంలో ప్రత్యేకమైన తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అప్పటినుండి ఇప్పటివరకు విద్యార్థులకు కంప్యూటర్ విద్యను ప్రభుత్వాలు అధికారులు గానీ తెలంగాణ రాష్ట్రంలో అందించడం లేదన్నారు పేద మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు కంప్యూటర్ విద్యకు దూరమవుతున్నారన్నారు. అలాగే స్పోర్ట్స్ కిట్స్ కూడా తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు సరిగా అందడం లేదన్నారు. పాఠశాలలో విద్యార్థులు అనేకమైన సమస్యలతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. అన్నారు ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించాలన్నారు. లేదంటే రాష్ట్రంలో విద్యార్థి ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గణేష్ ప్రశాంత్ శశాంక్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# చలో నల్లగొండకు తరలిన బిఆర్ఎస్ శ్రేణులు



రాజాపేట, ఫిబ్రవరి 13(తీన్మార్ న్యూస్): ఎన్నికల తర్వాత మొట్టమొదటిసారిగా నిర్వహిస్తున్న బిఆర్ఎస్ భారీ బహిరంగ సభకు రాజపేట మండలం నుండి భారీగా పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. ప్రత్యేక వాహనాలలో అన్ని గ్రామాల నుండి ఉత్సాహంగా బయలుదేరారు. కార్యక్రమంలో రాజపేట మండల పార్టీ అధ్యక్షులు కంచర్ల శ్రీనివాస్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ మోత్కూపల్లి జ్యోతి ప్రవీణ్, జాల తాజా మాజీ సర్పంచి గుంటి మధుసూదన్ రెడ్డి, మండల పార్టీ సెక్రటరీ జనరల్ సందిల భాస్కర్ గౌడ్, మాజీ ప్రజా ప్రతినిధుల ఫోరం మండల శాఖ అధ్యక్షులు బొంగోని ఉప్పలయ్య, యువజన విభాగం మండల శాఖ అధ్యక్షులు పల్లె సంతోష్ కుమార్ గౌడ్, కటకం స్వామి, ఎర్ర గోకుల జస్వంత్, పిఎసిఎస్ చైర్మన్ చింతలపూరి భాస్కర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, తదితరులు ఉన్నారు.

# గొప్పగా ఎదగాలనే స్ఫూర్తి కలుగుతుంది





రామన్నపేట, ఫిబ్రవరి 13(తీన్మార్ న్యూస్)బీబీస్వపరిపాలన దినోత్సవం లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం వలన, సమాజంలో మంచి స్థాయికి ఎదగాలనే స్ఫూర్తి కలుగతుందని మునిపంపుల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తిరుమల్ రెడ్డి అన్నారు. అనంతరం అధికారులుగా, ఉపాధ్యాయులుగా తమ పాత్రలను ఉత్తమంగా పోషించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. చదువుతోపాటు విద్యార్థులంతా సాంస్కృతిక కార్యక్రమంలో ఆసక్తిగా పాల్గొనడం మంచి విషయమని ప్రధానోపాధ్యాయులు కంచిరవికుమార్ అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణయ్య, అనిల్ కుమార్, వనజాత, ఉమ పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా నాని, జిల్లా కలెక్టర్ గా వర్షిత, జిల్లా విద్యాధికారిగా మనోహర్, మండల విద్యాధికారిగా మణిచందన్, ప్రధానోపాధ్యాయులుగా అఖీరానందన్, ఉపాధ్యాయులుగా పవన్, నక్షత్ర, నివేదిత, తరుణ్ సందేశ్, ప్రణవి, వెన్నెల తదితరులు పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జకారియా స్కూల్ విద్యార్థిని మెర్సీ






రాజాపేట, ఫిబ్రవరి 13(తీన్మార్ న్యూస్): జాతీయ సైన్స్ దినోత్సవము సందర్భంగా టి.ఎస్.సి.ఓ.ఎస్. టి & ఇ.పి.టి.ఆర్. ఐ. ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జరిగిన పోటీలో పోయెట్రీ( సేఫ్ వాటర్) లో రాజాపేట మండలం జాల గ్రామంలోని జకారియా ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నుండి 9వ తరగతి విద్యార్థిని ముక్కెర మెర్సీ జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి పొందారు. విద్యార్థిని, ఉపాధ్యాయురాలిని పాఠశాల యాజమాన్యం బీషప్ జాన్ గొల్లపల్లి, తిమోతి డెక్టర్ గొల్లపల్లి లు అభినందించారు. ఈనెల 25వ, తేదీన రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక అయిన సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తమ స్కూల్ విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో ఎంపిక కావడం చాల గర్వకారమన్నారు. అలాగే రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలో కూడ మంచి ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి గుర్తింపు తేవాలని మెర్సీ ని గైడ్ ఉపాధ్యాయురాలు ఉపేంద్రను ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి కోరారు. ఈ సందర్భంగా మెర్సీ నీ గైడ్ టీచర్ ఉపేంద్ర ను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# క్రీడలతోనే పిల్లలకి ఆరోగ్యం

**– జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన సీఆర్పీఎఫ్ విద్యార్థులు**

**– పిల్లలకు ఆసక్తి ఉన్న రంగాలలో తల్లిదండ్రులు ప్రోత్సహించాలి**



జవహర్ నగర్, ఫిబ్రవరి 13(తీన్మార్ న్యూస్): ఆధునిక కాలంలో విద్యార్థులు మొబైల్ వాడకం ఎక్కువైందని, ఫోన్లకు దూరంగా ఉంచి క్రీడా ప్రపంచంవైపు దృష్టి సారించాలని సీఆర్పీఎఫ్ ప్రిన్సిపల్ అపర్ణ సూచించారు. జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన సీఆర్పీఎఫ్ విద్యార్థులకు మంగళవారం క్యాంపస్ లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అపర్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో ముందుండటం అభినందనీయమని, చిన్నప్పటి నుంచే క్రీడలపై మక్కువ పెంచుకోవాలని అన్నారు. సీఆర్పీఎఫ్ పాఠశాలలో చదువు, క్రీడలు, సంస్కృతిక కార్యక్రమాలకు నిలయంగా మారిందని తెలిపారు. అనంతరం గుజరాత్లో నిర్వహించే అంతర్జాతీయ అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన వసంత్, రక్షిత్లకు ప్రిన్సిల్ అపర్ణ, ఫిజికల్ డైరెక్టర్ కూరపాటి రాజశేఖర్, పాఠశాల బృందం సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వెంకట్రాజు, అశాజికుమార్, కిషోర్, గోపాలకృష్ణ, దివ్య, సబీనా, నవనీతరాణి, చంద్రశేఖర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# నేడే వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రాక

**– షాహెదల్లా దర్గా ఉర్సు ఉత్సవాల్లో పాల్గొననున్న మంత్రి రాజనరసింహ**





టేక్మాల్, ఫిబ్రవరి 13(తీన్మార్ న్యూస్): నేడు తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రానున్నారు. మండల కేంద్రంలోని హాజరత్ షాహెదల్లా దర్గా వద్ద జరిగే ఉర్సు ఉత్సవాలలో సాయంత్రం 5:00 గంటలకి పాల్గొంటారని టేక్మల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మ రమేష్ మరియు మెదక్ జిల్లా మైనార్టీ కాంగ్రెస్ చైర్మన్ మరియు మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ మజహర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా నాయకులు, మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, యువజన విభాగ నాయకులు, కార్యకర్తలు అందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు.

# భువనగిరి జిల్లాలో బెస్ట్ అవెలబుల్ పాఠశాల ఎంపిక ప్రక్రియ ప్రారంభం

**– నోటిఫికేషన్ ఉత్తర్వులు జారీ చేసిన షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ**

**– ఆసక్తి కలిగిన పాఠశాలలు దరఖాస్తు చేసుకోవాలని సూచన**

భువనగిరి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 13(తీన్మార్ న్యూస్): భువనగిరి జిల్లాలో బెస్ట్ అవెలాబుల్ స్కూల్ ఎంపిక ప్రక్రియ ప్రారంభించారు. ఈ ఎంపిక ప్రక్రియ కి షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారులు నోటిఫికేషన్ జారు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా పరిదిలో ప్రైవేటు/కార్పోరేట్ పాఠశాల యాజమాన్యలు ఎస్సి విద్యార్ధినీ/విద్యార్ధులకు బెస్ట్ అవైలెబుల్ స్కీం క్రింద 2024-25 సంవత్సరమునకు, 1వ తరగతి (డే స్కాలర్) మరియు 5వ తరగతి (రెసిడెన్షియల్) నందు ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ప్రవేశం కల్పించుటకు గాను అర్హత కలిగిన పాఠశాలలను ఎంపిక చేయుటకు గాను ఆసక్తి కలిగిన ప్రైవేటు/కార్పోరేట్ పాఠశాల యాజమాన్యాల నుండి ధరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి కలిగిన ప్రైవేటు/కార్పోరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఈ దిగువ పేర్కొన్న షరతులకు లోబడి ఉండవలెను. దరఖాస్తులు సమర్పించవలసిన చివరి తేది.20.02.2024.

1. పాఠశాల ప్రారంభం నుండి ప్రభుత్వ గుర్తింపు పొంది ఉండాలి.
2. గత (5) సంవత్సరముల నుండి 7వ తరగతి యందు మరియు 10వ తరగతి యందు 90% పైన ఉత్తీర్ణులు అయి ఉండాలి, అందులో 50% మొదటి తరగతి యందు ఉత్తీర్ణత కలిగి ఉండాలి.
3. పాఠశాల అన్ని వసతులు కలిగి ఉండాలి, అన్ని మౌళిక సదుపాయాలు కలిగి ఉండాలి.
4. పాఠశాలల యాజమాన్యం వారి యొక్క ఫీజుల వివరములతో సమర్పించాలి.
5. పాఠశాలలో పని చేసే సిబ్బంది ప్రభుత్వ నియమావళి ప్రకారం ఉండాలి.
6. పాఠశాల సొంత భవనముతో పాటు ఆట స్థలం కూడా కలిగి ఉండాలి.
7. పాఠశాల హాస్టల్ వసతి కలిగి ఉండాలి.
8. హాస్టల్ వసతి బాలుర/బాలికలకు వేరు వేరుగా ఉండాలి.

ఏదైనా సందేహాలు ఉంటే సంబంధిత శాఖ అధికారులను సంప్రదించాలని కోరారు.

# పంట పొలాలకు నీటిని విడుదల చేయాలి

- డిజిల్ పోసుకొని నిప్పంటించుకునే ప్రయత్నం..
- నిరసనను అడ్డుకున్న పోలీసులు...





రాజన్న సిరిసిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 13(తీన్మార్ న్యూస్): ఇల్లంతకుంట మండలం, దాచారం గ్రామ రైతులు మండల యువజన సంఘాల అధ్యక్షుడు మాజీ బిజెపి అధ్యక్షుడు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నాడు ఎమ్మార్వో కార్యాలయం ముందు బైఠాయించి నిరసన కార్యక్రమం తెలిపారు.

దాచారం గ్రామ రైతుల పంట పొలాలు ఎండిపోతున్నాయి. విఠలాపూర్ కెనాల్ నీళ్లు దాచారం గ్రామ రైతులకు మళ్లించాలని రైతులు ఎమ్మార్వో కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం తలపెట్టారు. సిరిసిల్ల రూరల్ సీఐ సదన్ కుమార్, ఎమ్మార్వో బెంద్రం తిరుపతిరెడ్డి వినకుండా నిరసన కార్యక్రమం ఆపకపోగా పోలీసులు చూస్తుండగానే వంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకునే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకొని అగ్గిపెట్టె తీసుకొని విసిరేశారు. ఒక్కసారిగా అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నిరసనలో దాదాపు ముప్పై మందికి పైగా రైతులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ బహిరంగ సభను జయప్రదం చేయాలి

నాగారం, ఫిబ్రవరి 13(తీన్మార్ న్యూస్): నల్గొండ లో మంగళవారం నిర్వహించిన కేసిఆర్ సభకు నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల నుంచి ప్రజలు, బిఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. నాగారం మున్సిపాలిటీ నుంచి చైర్మన్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో, దమ్మాయిగూడ నుంచి ఛైర్పర్సన్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో వెళ్లారు. ఈ కార్యక్రమంలో నాగారం చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, దమ్మాయిగూడ ఛైర్పర్సన్ ప్రణీత శ్రీకాంత్ గౌడ్, కౌన్సిలర్లు, పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో



పాల్గొన్నారు.

# ఓటర్ జాబితా ఇవ్వరు.. లెక్కలు చెప్పరు..




మంచిర్యాల : మంచిర్యాల జిల్లా టీఎన్జీవోల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతున్నది. ఎన్నికల సందర్భంగా యూనియన్ బై-లా పాటించడం లేదనే విషయం వెలుగులోకి రావడంతో పాటు తాజాగా టీఎన్జీవో లెక్కలపైనా చర్చ మొదలైంది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని టీఎన్ఎన్జీవో కార్యాలయం కింద ఉన్న షాపుల ద్వారా వచ్చే అద్దెలు, ఫంక్షన్ హాల్ ద్వారా ఆ సంఘానికి వచ్చే ఆదాయం నెలకు దాదాపు రూ.లక్ష వరకు ఉంటుంది. కానీ ఇందుకు సంబంధించిన లెక్కల రికార్డులను సరిగా నిర్వహించడం లేదనే ఆరోపణలున్నాయి. దీనిపై టీఎన్జీవో అధ్యక్షుడు గడియారం శ్రీహరిని వివరణ కోరగా.. యూనియన్ బై-లా ప్రకారం అసెట్ రికార్డులు నిర్వహిస్తున్నామన్నారు. అలాగైతే ఆ రికార్డులు చూపండి అని అడుగగా.. ఇప్పటికిప్పుడు అడిగితే ఎలా చూపిస్తామంటూ దాటవేశారు. పోయిన నెలదైనా చూపించాలని కోరగా.. అద్దెలు ఏ నెలది.. ఆ నెల ఇవ్వరు.. మూడు, నాలుగు నెలలకోసారి ఇస్తారు.. వారం, పది రోజులయ్యాక రండి రికార్డులు చూపిస్తామని చెప్పుకొచ్చారు. ఈ విషయమై టీఎన్జీవోలోని కొందరు ఉద్యోగులు గతంలోనే జిల్లా కమిటీని నిలదీయగా.. ముందున్న కమిటీ లెక్కలు మాకు చెప్పలేదని, ఇప్పుడు మేం కూడా చెప్పమంటూ ఆ సంఘాన్ని అన్నీ తానై నడిపే ఓ లీడర్ దురుసుగా సమాధానం ఇచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అసలు యూనియన్ లెక్కలు ఉన్నాయా.. ఉంటే చూపించడానికి అంత టైమ్ ఎందుకని కొందరు టీఎన్జీవోలే ప్రశ్నిస్తున్నారు. టీఎన్జీవోల సభ్యత్వ నమోదు చేయకుండా, ఓటర్ జాబితా లేకుండా ఎన్నికలకు ఎలా వెళ్తారనే ప్రశ్నలు లేవనెత్తిన నేపథ్యంలో నామమాత్రంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలుస్తుంది. కాకపోతే ఇది అన్ని ప్రభుత్వ శాఖల్లో కాకుండా ఇప్పుడున్న కార్యవర్గానికి ఫేవర్‌గా ఉండే శాఖల్లోనే ఇది చేస్తున్నట్లు తెలిసింది. రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల్లోనే సభ్యత్వ నమోదు చేస్తున్నారని, త్వరలో జరిగే ఎన్నికల్లోనూ ఆ రెండు శాఖల ఉద్యోగులే పాల్గొంటారని.. వాళ్లే ఎన్నికల అధికారులు, వాళ్లే ఓటర్లు, ఎన్నికయ్యేది కూడా వాళ్లే అంటూ మిగిలిన శాఖల్లోని టీఎన్జీవోలు మండిపడుతున్నారు. విషయం బయటికి వచ్చినందుకే యూనియన్ నాయకులకు ఇప్పుడు బై-లా గుర్తుకు వచ్చిందంటున్నారు. ఉద్యోగుల్లో వ్యతిరేకత ఉన్నప్పటికీ టీఎన్జీవోను నడిపించే పెద్దలు ఏ మాత్రం పట్టించుకోకుండా ముందుకు వెళ్తున్నారని ఆరోపిస్తున్నారు. హడావుడిగా ఎన్నికలు నిర్వహించి యూనియన్ పగ్గాలు దక్కించుకోవాలనే కుట్రల్లో భాగంగానే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా ఎన్నికలకు వెళ్తున్నారని చెప్తున్నారు. 2023 డిసెంబర్‌లో సభ్యత్వ నమోదు చేసినట్లు చెప్తున్నా.. ఆ జాబితా ఇవ్వడానికి కూడా ప్రస్తుతం ఉన్న యూనియన్ పెద్దలు ఇష్టపడడం లేదంటున్నారు.

## గృహ రుణాలపై భారీగా వడ్డీ రేట్ల పెంపు

# అన్ని బ్యాంకులదీ అదే దారి..

భారతదేశంలో సొంతింటి కలను నిజం చేసుకోవాలనుకునే వారికి బ్యాంకులు షాకిచ్చాయి. దేశంలోని అనేక బ్యాంకులు జనవరి 2024లో తమ రుణ రేట్లను సర్దుబాటు చేశాయి. ప్రత్యేకంగా మార్జినల్ కాస్ట్-బేస్డ్ లెండింగ్ రేట్లను సవరించడంతో వడ్డీ రేట్లు తగ్గాయి. ఇంచుమించు అన్ని బ్యాంకులు తక్కువ వడ్డీకే గృహ రుణాలను అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏయే బ్యాంకులు ఎంత శాతం వడ్డీకు రుణాలిస్తున్నాయో? ఓసారి తెలుసుకుందాం. ఐసీఐసీఐ బ్యాంక్ వెబ్‌సైట్ ప్రకారం జనవరి 1 నుంచి దాని ఎంసీఎల్ఆర్ రేటును 10 బేసిస్ పాయింట్లు పెంచింది. ఓవర్‌నైట్ రేటు మునుపటి 8.5 శాతం నుంచి 8.6 శాతానికి సర్దుబాటు చేశారు. ఒక నెల ఎంసీఎల్ఆర్ ఆధారిత రుణ రేటు మునుపటి 8.5 శాతంతో పోలిస్తే ఇప్పుడు 8.6 శాతం వద్ద ఉంది. అదనంగా మూడు నెలల రేటు 8.55 శాతం నుంచి 8.65 శాతానికి సవరించారు. ఆరు నెలల రేటు 8.90 శాతం నుంచి 9 శాతానికి, ఒక సంవత్సరం రేటు మునుపటి 9 శాతం నుంచి 9.10% వద్ద ఉంది. పీఎన్‌బీ వెబ్‌సైట్ ప్రకారం జనవరి 1 నుంచి బ్యాంక్ తన రుణ రేట్లను కొద్దిగా పెంచింది. ఓవర్‌నైట్ రేటు ఇప్పుడు 8.25 శాతం నుంచి ఒక నెల రేటు 8.30 శాతానికి పెంచింది. మూడు నెలల రేటు 8.40 శాతం, ఆరు నెలల రేటు 8.60 శాతం, ఒక సంవత్సరం రేటు 8.70 శాతానికి చేరింది. యస్ బ్యాంక్ వెబ్‌సైట్‌లోని సమాచారం ప్రకారం కొత్త రేట్లు జనవరి 1 నుంచి అమలులోకి వస్తాయి. ఓవర్‌నైట్ రేటు 9.2 శాతం ఉండగా ఒక నెలకు ఎంసీఎల్ఆర్ ఆధారిత రుణ రేటు 9.45 శాతంగా ఉంది. మూడు నెలల రేటు 10 శాతం, ఆరు నెలల రేటు 10.25 శాతం, ఒక సంవత్సరం రేటు 10.50 శాతంగా ఉంది. బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లోని సమాచారం ప్రకారం బ్యాంక్ ఓవర్‌నైట్ పదవీకాలంలో 5 బేసిస్ పాయింట్లు పెరిగింది. ఇది జనవరి 1 నుండి అమలులోకి వచ్చింది. ఓవర్‌నైట్ రేటు




ఇప్పుడు 8 శాతానికి చేరింది. ఒక నెలకు ఎంసీఎల్ఆర్ ఆధారిత రుణ రేటు 8.25 శాతం కాగా, మూడు నెలల రేటు 8.40 శాతం, ఆరు నెలల రేటు 8.60 శాతం, ఒక సంవత్సరం రేటు 8.80 శాతంగా ఉంది. బ్యాంక్ ఆఫ్ బరోడా జనవరి 12 నుంచి తన ఎంసీఎల్ఆర్‌ను సర్దుబాటు చేసింది. ఓవర్‌నైట్ ఎంసీఎల్ఆర్ మునుపటి 8 శాతం నుంచి 8.5 శాతానికి పెరిగింది. ఒక నెల ఎంసీఎల్ఆర్ 8.3 శాతం వద్ద మారలేదు. అయితే మూడు నెలల ఎంసీఎల్ఆర్ కూడా 8.4 శాతం వద్ద స్థిరంగా ఉంది. ఆరు నెలల ఎంసీఎల్ఆర్ మునుపటి 8.55 శాతం నుంచి 5 బేసిస్ పాయింట్లు స్వల్పంగా పెరిగి 8.60 శాతానికి చేరుకుంది. ఒక సంవత్సరం ఎంసీఎల్ఆర్ ఇప్పుడు 8.80 శాతానికి చేరుకుంది. కెనరా బ్యాంక్ కూడా జనవరి 2024 నుంచి వివిధ కాలాల్లో బ్యాంక్ తన రుణ రేట్లను 5 బేసిస్ పాయింట్లు పెంచింది. ఓవర్‌నైట్ రేటు 8 శాతం నుంచి 8.05 శాతానికి పెరిగింది. ఒక నెల రేటు ఇప్పుడు 8.1 శాతం నుంచి 8.15 శాతానికి పెరిగింది. అలాగే మూడు నెలల రేటు 8.20 శాతం నుంచి నుండి 8.25 శాతానికి పెరిగింది. ఆరు నెలల రేటు 8.55 శాతం నుంచి 8.60 శాతానికి పెరిగింది. అలాగే ఒక సంవత్సరం రేటు ఇప్పుడు 8.75 శాతం నుంచి 8.80 శాతానికి పెరిగింది. రెండేళ్ల రేటు 9.10 శాతానికి పెరిగింది.

## అకస్మాత్తుగా స్మోకింగ్ మానేస్తే..

# మీ శరీరంలో జరిగే మార్పులివే..

మద్యపానం, ధూమపానం ఆరోగ్యానికి హానికరం. ఈ విషయం అందరికీ తెలుసు. మనం వినోదం కోసం చూసే సినిమా మొదట్లో కూడా ఈ అడ్వర్టైజ్ మెంట్ నే వేస్తారు. అంతెందుకు సిగరెట్ పెట్టెపై కూడా ఇదే రాసి ఉంటుంది. కానీ.. చాలామంది స్మోకింగ్ ను మానలేరు. ఒక్కసారి అలవాటైందా.. దాని పరిధి అంతకంతకూ పెరుగుతుందే తప్ప.. తగ్గదు. ఒత్తిడి తగ్గడానికి సిగరెట్ తాగుతున్నాం అంటారు. నిజానికి సిగరెట్ స్మోకింగ్ కూడా ఒక వ్యసనమే. దీనివల్ల ఆరోగ్యం పాడవుతుందే తప్ప.. బాగుపడేదేం ఉండదు. ఈ విషయం సిగరెట్ తాగేవారందరికీ తెలిసిందే. అయినా కాని దానిని మానలేరు. పొగతాగేవారికే కాదు.. పీల్చేవారికి కూడా ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఒకవేళ మీరు ఉన్నట్టుండి సిగరెట్ మానేస్తే మీ శరీరంలో ఎలాంటి మార్పులొస్తాయో తెలుసుకుందాం. సిగరెట్ స్మోకింగ్ మానేయడం అంత ఈజీ కాదు. ప్రతిరోజూ సిగరెట్ కాల్చే అలవాటున్నవారు ఒక్కరోజు మానేస్తేనే.. ఆకలి, అలసట, తలనొప్పి, నిద్రలేమి, దగ్గు, మలబద్ధకం వంటి తాత్కాలిక సమస్యలు ఎదురవుతాయి. సిగరెట్ తాగడం వల్ల.. గుండె, హార్మోన్లు, జీవక్రియ, మెదడు సహా.. శరీరంలోని అనేక భాగాలు ప్రభావితమవుతాయి. ఈ రోజులలో కేవలం పురుషులే కాదు.. మహిళలు కూడా సిగరెట్ కు బానిసలయ్యారు. సిగరెట్ మానేయడం వల్ల వచ్చే సమస్యలు లైఫ్ టైమ్ ఉండవంటున్నారు నిపుణులు. 2-3 వారాల పాటు సిగరెట్ మానేయడంతో ఆకలి, అలసట, తలనొప్పి, నిద్రలేమి, దగ్గు, మలబద్ధకం వంటి తాత్కాలిక సమస్యలు ఉంటాయి. సిగరెట్ మానేశాక.. దానికి మళ్లీ బానిసలవ్వకుండా ఉండాలంటే.. నిపుణుల సలహా మేరకు నికోటిన్ రీప్లేస్ మెంట్ థెరపీ మందులను వాడొచ్చు. సిగరెట్ తాగడం మానేశాక.. మళ్లీ దానిపై మనసు మళ్లితే ఆ కోరిక 15-20 నిమిషాలు మాత్రమే ఉంటుంది. ఈ సమయంలో పాటలు వినడం, వీడియోలు చూడటం, పనిలో నిమగ్నమవ్వడం, ఫ్రెండ్స్ లేదా ఫ్యామిలీతో మాట్లాడటం వంటివి చేయాలి. అంటే మిమ్మల్ని మీరు బిజీగా



ఉంచుకోవాలి. మీరు సిగరెట్ స్మోకింగ్ మానేస్తే.. ఎంత సమయానికి ఏయే మార్పులొస్తాయో చూద్దాం..

- 20 నిమిషాల పాటు సిగరెట్ మానేస్తే.. బీపీ, హార్ట్ బీట్ బాగుంటుంది. రక్తప్రసరణ కూడా మెరుగవుతుంది.
- 8 గంటలపాటు సిగరెట్ మానేస్తే.. రక్తంలో నికోటిన్, కార్బన్ మోనాక్సైడ్ స్థాయిలు సగానికి తగ్గుతాయి.
- 12 గంటలు సిగరెట్ తాగకపోతే.. రక్తంలో కార్బన్ మోనాక్సైడ్ స్థాయిలు సాధారణ స్థితికి వచ్చేస్తాయి.
- 24 గంటలు మానేస్తే.. కార్బన్ మోనాక్సైడ్ కరిగి.. దగ్గు ద్వారా గొంతు నుంచి వెళ్లిపోతాయి.
- 72 గంటలు మానేస్తే.. ఊపిరితిత్తులు మరింత గాలిని పంపిస్తాయి. శ్వాసతీసుకోవడంలో ఇబ్బందులు తగ్గుతాయి.
- 1-2 వారాలపాటు సిగరెట్ మానేస్తే.. ఊపిరితిత్తుల పనితీరుతో పాటు రక్తప్రసరణ మెరుగుపడుతుంది.
- 1 నెల మానేస్తే.. రక్తప్రసరణ మెరుగ్గా జరుగుతుంది. చర్మాన్ని పోషిస్తుంది. ముడతలు కూడా తగ్గుతాయి.
- 15 సంవత్సరాలు సిగరెట్ కు దూరంగా ఉంటే.. గుండెపోటు వచ్చే ప్రమాదం క్రమంగా తగ్గుతుంది.

## ప్రతి సెకన్‌కు రూ.3,14,618 విలువైన

# ముడి చమురును కొంటున్న భారత్




పెట్రోల్, డీజిల్ కాకుండా గ్యాస్ కోసం భారతదేశం ఎంత చెల్లిస్తుందో తెలుసా .. భారత ప్రభుత్వం దిగుమతి బిల్లుల్లో ముడి చమురు, సహజ వాయువు అత్యధిక వాటాను కలిగి ఉన్నాయి. సరళ భాషలో చెప్పాలంటే.. ముడి చమురు, సహజ వాయువు కోసం ప్రభుత్వం ప్రతి సెకనుకు రూ. 3,14,618 బిల్లు చెల్లిస్తుంది. ఈ డేటా పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్‌కి సంబంధించినది. ఇది పెట్రోలియం మంత్రిత్వ శాఖకు చెందిన విభాగం. వాస్తవానికి, ప్రభుత్వం ఈ ఏజెన్సీ దేశంలోని ముడి చమురు, సహజ వాయువు దిగుమతి విలువ, బిల్లు గురించి సమాచారాన్ని అందించింది. ఈ సమాచారం ఏప్రిల్ 2023 నుండి డిసెంబర్ 2023 వరకు అంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూడు త్రైమాసికాలు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబర్ మధ్యకాలంలో భారతదేశ చమురు, గ్యాస్ దిగుమతి బిల్లు సంవత్సరానికి 21 శాతం క్షీణతను చూసింది. ముడి చమురు ధరల తగ్గుదల కారణంగా ఈ కాలంలో మొత్తం బిల్లు 89.9 బిలియన్ డాలర్లు అంటే రూ.7.47 లక్షల కోట్లు. ఈ బిల్లును ఒక్క సెకను ఆధారంగా లెక్కిస్తే రూ.3,14,618 వస్తుంది. పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ (%ళ్రూాజ%) తాజా డేటా ప్రకారం.. భారతదేశం ముడి చమురు దిగుమతులు డిసెంబర్ వరకు 172.9 మిలియన్ టన్నులకు కొద్దిగా పెరిగాయి. ఇది 2022-23 ఆర్థిక సంవత్సరంలో అదే కాలంలో కొనుగోలు చేసిన 172.3 మిలియన్ టన్నుల కంటే కొంచెం ఎక్కువ. 2023 ఆర్థిక సంవత్సరంలో.. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత ముడి చమురు ధరలు రికార్డు స్థాయిలో బ్యారెల్‌కు 130 డాలర్లకు చేరుకున్నాయి. దీనికి ప్రధాన కారణం యుద్ధం కారణంగా సరఫరా తక్కువగా ఉ ఒడటం. అయితే, గల్ఫ్ దేశాల బ్రెంట్ క్రూడ్, అమెరికన్ క్రూడ్ ఆయిల్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ 2023లో 10 శాతానికి పైగా క్షీణించాయి. 2020 నుండి సంవత్సరం చివరిలో వాటి కనిష్ట స్థాయికి చేరుకున్నాయి. జనవరిలో ఇప్పటివరకు భారతీయ ముడి చమురు బాస్కెట్ బ్యారెల్‌కు సగటున 77.85డాలర్లు ఉండగా, ఏప్రిల్ 2023లో ఇది బ్యారెల్‌కు 83.76డాలర్లుగా ఉంది. అంటే అప్పటి నుండి భారతీయ బాస్కెట్ 7 శాతానికి పైగా చౌకగా మారింది. డిసెంబర్ చివరి నాటికి, దిగుమతి చేసుకున్న ముడి చమురుపై భారతదేశం ఆధారపడటం 87.5 శాతానికి పెరిగింది. ఇది గత ఏడాది ఇదే కాలంలో 87 శాతం కంటే స్వల్పంగా ఎక్కువ. డిసెంబర్‌లో భారతదేశం ముడి చమురు దిగుమతి పరిమాణం 19.6 మిలియన్ టన్నులుగా ఉంది. ఇది గత ఏడాది ఇదే నెలలో దిగుమతి చేసుకున్న 19.8 మిలియన్ టన్నుల కంటే కొంచెం తక్కువ. దీని తర్వాత నవంబర్‌లో 2 శాతం తగ్గింది. డిసెంబరులో లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (%ాచీ+%) దిగుమతులు కూడా సంవత్సరానికి 12.1 శాతం పెరిగి 2,393 మిలియన్ మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల (%వీమీాజవీ%)కి చేరుకున్నాయి. ఏప్రిల్-డిసెంబర్ కాలంలో మొత్తం 22,856 %వీమీాజవీ% దిగుమతి అయ్యాయి, ఇది గతేడాది కంటే 14.2 శాతం ఎక్కువ. డిసెంబర్‌లో ఎల్ఎన్‌జి దిగుమతులు ఎక్కువగా ఉన్నప్పటికీ, విలువ 1.1 బిలియన్ డాలర్ల వద్ద స్థిరంగా ఉంది. ఏప్రిల్-డిసెంబర్‌లో మొత్తం దిగుమతి విలువ 2023 ఆర్థిక సంవత్సరం అదే కాలంలో 13.7 బిలియన్ డాలర్ల నుండి 9.9 బిలియన్ డాలర్లకు పడిపోయింది.

## దాడులు, ప్రతిదాడులతో అట్టుడుకుతున్న పశ్చిమాసియా..

# ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్న ప్రజలు

దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియా అట్టుడుకుతున్నది. పలు దేశాల్లో నిత్యం బాంబుల మోత మోగుతుండటంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు. హమాస్-ఇజ్రాయెల్ యుద్ధంతో మొదలైన ఉద్రిక్తతలు.. తాజాగా ఇతర దేశాలకూ విస్తరించాయి. తాజాగా పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రాంతంలో ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ మంగళవారం దాడులు చేసింది. సున్నీ మిలిటెంట్ గ్రూపు జైష్ అల్ అదిల్‌కు చెందిన రెండు ప్రధాన స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. దీనిపై పాకిస్థాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇరాన్ తమ గగనతల ఉల్లంఘనకు పాల్పడిందని, దాడుల్లో ఇద్దరు చిన్నారులు మరణించారని పేర్కొన్నది. తమ దేశంలోని ఇరాన్ రాయబారిని కూడా బహిష్కరిస్తున్నట్టు బుధవారం వెల్లడించిన పాక్.. అలాగే ఆ దేశంలో ఉన్న తమ రాయబారిని కూడా వెనక్కు పిలిపించుకొన్నది. ఇరాన్ చర్యలకు తీవ్ర పరిణామాలు ఉంటాయని పాక్ విదేశాంగ శాఖ హెచ్చరించింది. ఇరాన్ దాడుల తర్వాత పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్‌తో సరిహద్దులు పంచుకొనే సిస్తాన్ ప్రావిన్స్‌లో ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్(ఐఆర్‌జీ)కి చెందిన సభ్యుడిని గుర్తుతెలియని వ్యక్తులు కాల్చిచంపడం సంచలనంగా మారింది. మరోవైపు శత్రువులను ఎదుర్కొనేందుకు తమ క్షిపణి శక్తిని వినియోగించుకోవడానికి ఎంత మాత్రం వెనుకాడబోమని ఇరాన్ రక్షణ శాఖ మంత్రి మహ్మద్ రేజా స్పష్టం చేశారు. హమాస్-ఇజ్రాయెల్ యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. హమాస్‌కు ఇరాన్, యెమెన్ హౌతీలు మద్దతుగా ఉంటున్నాయి. ఎర్రసముద్రంలో అమెరికా, మిత్రదేశాల వాణిజ్య నౌకలపై హౌతీలు వరుస దాడులకు పాల్పడుతున్నారు. హెచ్చరికలను పెడచెవిన పెట్టడంతో యెమెన్‌లోని హౌతీ సైనిక స్థావరాలపై గత వారం అమెరికా, బ్రిటన్ క్షిపణులతో దాడులు చేశాయి. దాడికి ప్రతిదాడి అన్నట్టుగా హౌతీలు తాజాగా సోమవారం యెమెన్ తీరంలోని గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌లో అమెరికా నౌకపై యాంటీ షిప్ క్షిపణితో దాడి చేశారు. ఈ నేపథ్యంలో హౌతీలను మళ్లీ గ్లోబల్ టెర్రరిస్టు జాబితాలో చేరుస్తూ బైడెన్ సర్కార్ బుధవారం నిర్ణయం తీసుకొన్నదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పాక్‌పై దాడుల్లో భాగంగా ఇరాన్ తాజాగా టార్గెట్ చేసుకొన్న ఉగ్రవాద గ్రూపు 'జైష్ అల్



ఆదిల్'పై ప్రస్తుతం చర్చ నడుస్తున్నది. 2012లో స్థాపించబడిన ఈ సంస్థ 2013లో దాడి చేసి 14 మంది ఇరాన్ గార్డులను చంపడంతో వార్తల్లోకి వచ్చింది. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తూ ఇరాన్‌లోని సిస్థాన్-బలూచిస్థాన్‌లో తన కార్యకలాపాలను నిర్వహిస్తున్నది. తన ఉనికిని చాటుకొనే ప్రయత్నంలో భాగంగా ఇరాన్ సరిహద్దుల్లో పోలీసులు, జవాన్లను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడింది. వరుసగా పలు హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్న క్రమంలో ఈ గ్రూపును ఇరాన్ తీవ్రంగా పరిగణించింది. ఈ క్రమంలో తాజాగా జైష్ అల్ ఆదిల్ స్థావరాలపై దాడులకు పాల్పడింది. ప్రస్తుతం పాక్ చెరలో ఉన్న భారత నౌకాదళ మాజీ అధికారి కుల్‌భూషణ్ జాదవ్‌ను ఈ గ్రూపే కిడ్నాప్ చేసి, పాక్ గూఢచర్య సంస్థకు విక్రయించిందని కూడా నిఘా వర్గాల సమాచారం హమాస్-ఇజ్రాయెల్ యుద్ధంలో ఇప్పటికే వేలాది మంది మరణించారు. ఈ యుద్ధం ఇప్పట్లో ముగిసే సంకేతాలు ఏవీ కనిపించడం లేదు. ఇప్పటి వరకు తాము మద్దతిచ్చే మిలిటెంట్ గ్రూపులతో దాడులు చేయించిన ఇరాన్.. ఇప్పుడు హమాస్-ఇజ్రాయెల్ యుద్ధ రంగంలోకి నేరుగా దిగినట్టు కనిపిస్తున్నది. ఇరాక్, సిరియాలపై సోమవారం క్షిపణులతో దాడులు చేసింది. ఉత్తర ఇరాన్‌లోని ఇర్బిల్‌లో ఉన్న ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్‌కు చెందిన ముఖ్య కార్యాలయంపై బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. మరోవైపు సిరియాలోని ఐసిస్ స్థావరాలపైనా దాడులు చేశామని ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది. ఇడ్లిబ్‌లోని తీవ్రవాద శిబిరాలను ధ్వంసం చేశామని పేర్కొన్నది.

## చర్చల పేరుతో కాలయాపన




అనంతపురం:అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని 34 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా.. చర్చల పేరుతో కాలయాపన మినహా వైకాపా ప్రభుత్వం ఏ ఒక్క సమస్య తీర్చలేదంటూ అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు.జిల్లా అంతటా నిరసన శిబిరాల్లో ఆకలి కేకలతో భోగి మంటలు వేశారు. వారు మంటల చుట్టూ తిరుగుతూ... నినాదాలు చేస్తూ జగన్ ప్రభుత్వంపై తీవ్ర అక్కసు వెల్లగక్కారు. అనంత కలెక్టరేట్ ముందు నిరసన శిబిరంలో భోగి మంటలు వేసి ఎస్మా ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్‌వాడీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు నాగేంద్రకుమార్, కార్యదర్శి రమాదేవి, కోశాధికారి జమున మాట్లాడుతూ ఎంతో సంతోషంగా జరుపుకోవాల్సిన సంక్రాంతి పండుగను నిరసనల మధ్య నిర్వహించే దుస్థితికి ఈ ప్రభుత్వం తీసుకొచ్చిందని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో అంగన్‌వాడీల సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. నిరసనలో సీపీఎం నగర కార్యదర్శి ఆర్‌వీ నాయుడు, మున్సిపల్ కార్మికుల సంఘం నాయకుడు నాగభూషణం, అంగన్‌వాడీల సంఘం నాయకులు అరుణ, ఆరిఫా, వరలక్ష్మి, రామాంజినమ్మ, నారాయణమ్మ, మహబూబ్‌బీ, అనసూయ, సలోమియా, భాగ్య, నారాయణమ్మ, శ్యామల, వీణా, సూర్యకళ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## హోరెత్తిన అంగన్‌వాడీల నిరసనలు



నరసరావుపేట : తమ సమస్యలు పరిష్కరించాలని 37 రోజులుగా సమ్మె చేస్తున్నా ఏ మాత్రం చలనం లేదని, వైకాపా ప్రభుత్వానికో దండం అంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు నిరసన వ్యక్తం చేశారు. కనీస వేతనం పెంచి, గ్రాట్యూటీ అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీలు జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలతో హోరెత్తించారు. ప్రభుత్వం ఎన్ని రకాలుగా వేధించి బెదిరింపులకు దిగినా సమస్యలు పరిష్కారం కానిదే సమ్మె నుంచి వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగి ఇబ్బంది పడుతున్నామని, వేతనాలు పెంచమని కోరితే జులై తర్వాత పెంపుదలపై ఆలోచిస్తామని ప్రభుత్వం ప్రకటించడంపై మండిపడుతున్నారు. బాపట్లలో దండం పెట్టి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లాలో అన్ని మండలాల్లో విభిన్న రూపాల్లో నిరసనలు కొనసాగించారు. క్రోసూరులో జగనన్నకు కోటి సంతకాలతో చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించి సంతకాల సేకరణ చేపట్టారు. వినుకొండలో సాష్టాంగ నమస్కారం చేసి ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని కోరారు. నరసరావుపేటలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. మాచర్ల, పిడుగురాళ్ల, గురజాల, చిలకలూరిపేటలో రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు.

## తెరుచుకోని ఆయుర్వేద ఆసుపత్రి



ఉరవకొండ: ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల గత ఆరు నెలలుగా తెరుచుకోలేదు. ఇక్కడ పనిచేస్తున్న సీనియర్ వైద్యాధికారి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అప్పటి నుంచి ఆ భవనాన్ని పట్టించుకున్న నాథుడు లేడు. పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు ఆయుర్వేద వైద్యం పరంగా ఈ ఆసుపత్రే దిక్కు. ఆ వైద్యశాల పని చేస్తే కనీసం రోజుకు 60 మందికి పైగా రోగులు వైద్య సేవలు పొందుతుంటారు. అంతేకాకుండా వైద్యాధికారి నిర్దేశిత సమయాల ప్రకారం గ్రామాల్లో ఆయుర్వేద వైద్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించడానికి వీలుంటుంది. ఇక్కడ ఆయుర్వేద వైద్యాధికారిని నియమించే దిశగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ఒక్క ఛాన్స్ ఇచ్చి మోసపోయాం వంటావార్పుతో అంగన్‌వాడీల నిరసన

అనంతపురం: 'ఒక అవకాశమంటూ అధికారంలోకి వచ్చి రాష్ట్ర ప్రజలను మోసం చేశారు. ఇక మీపాలన వద్దే వద్దు. ఐదేళ్ల కాలంలో మీరేంటో తేలిపోయింది. ఇచ్చిన మాటనే నిలబెట్టుకోలేదు. ఇలాంటి నాయకులు ప్రజాపాలనకు అనర్హులు. వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతాం' అని అంగన్‌వాడీలు సీఎం జగన్‌పై తీవ్ర ధ్వజమెత్తారు. తమ డిమాండ్ల పరిష్కారానికి చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 37వ రోజుకి చేరింది. అనంత కలెక్టరేట్ దగ్గర ఏర్పాటు చేసిన నిరసన శిబిరం వద్దే వంటా వార్పు కార్యక్రమంతో వినూత్న ఆందోళన చేపటారు. అనంత, రాప్తాడు, అనంత గ్రామీణ మండలాల నుంచి పెద్దఎత్తున అంగన్‌వాడీలు హాజరయ్యారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. నెల రోజులుకు పైగా నిరసనలు చేస్తుంటే కనీసం మానవత్వం లేకుండా ప్రభుత్వం ప్రవర్తించడం అన్యాయమన్నారు. సీఐటీయూ నాయకులు నాగేంద్ర, వెంకటనారాయణ, ముత్తజా, రామాంజనేయులు, గోపాల్, ముస్కిన్, అంగన్‌వాడీల సంఘం నాయకులు జమున, రమాదేవి, అరుణ, భారతి, రుక్మిణీ, అరీఫా, వరలక్ష్మి పాల్గొన్నారు.

# దోచుకో.. సొమ్ము చేసుకో




కళ్యాణదుర్గం: పండగ సెలవు రోజులు కావడంతో పెన్నా నది పరివాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా సాగుతున్నాయి. కొందరు అధికార పార్టీ నాయకులు, అధికారుల అండదండలతో ఈ దందా కొనసాగుతోంది. అధికారులు దాడులు చేసి పట్టుకున్నా ఏదో రకంగా నాయకులు బయటకు తీసుకొస్తున్నారు. : కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలోని నది పరివాహక కడరదకుంట, సి.వి.తండా, తిమ్మసముద్రం, బాలవెంకటాపురం, మంగళకుంట, ఓబుళాపురం, మానిరేవు, కడదరకుంట, పింజిరికొట్టాల, కొండాపురం, చెన్నంపల్లి, నూతిమడుగు, గూళ్యం, రాంపురం గ్రామాల నుంచి అధికంగా ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. పెన్నా సరిహద్దు గ్రామాల నుంచి ముట్టాల, గొరదిండ్ల, కొండపల్లి, అనంతపురం, తగరకుంట, తోపుదుర్తి, సనప, కనగానపల్లి గ్రామాల దూరాన్ని బట్టి ఒక్కో ట్రాక్టర్‌కు రూ.6 వేల నుంచి రూ.12 వేల వరకు ఇసుక ధర పలుకుతోంది. కొందరు అధికార పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా ఇసుకను తోడేస్తూ అక్రమార్జన కొనసాగిస్తున్నారు. వేల క్యూబిక్ మీటర్లు తోడేస్తుండడంతో భూగర్భ జలాలు అడుగంటి వ్యవసాయ బోరు బావుల్లో నీరు ఇంకిపోయి భూములు బీడులుగా మారుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తాగునీటి పథకాల నుంచీ అరకొరగా నీరు వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని రైతులు కోరుతున్నారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పోలీసులు సహకారంతో అలాంటి వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తాం. గ్రామాల్లో ఇలాంటివి జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే ప్రజలు మాకు సమాచారం అందజేసి సహకరిస్తే పూర్తిస్థాయిలో అడ్డుకొంటాం.

## విద్యుత్తు సరఫరా నిలిపివేతపై నిరసన



బుక్కపట్నం,:మండల పరిధిలోని బచ్చయ్యగారిపల్లి గ్రామంలోని బీసీకాలనీలో రెండ్రోజులుగా విద్యుత్తు సరఫరా ఆగిపోయింది. కాలనీ పరిధిలో ఉన్న రెండు నియంత్రికలు మరమ్మతులకు గురయ్యాయి. ఈ కాలనీలో దాదాపు రెండు నుంచి మూడు వందల కుటుంబాలు ఉన్నాయి. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో కాలనీవాసులు సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. వెంటనే కాలనీకి విద్యుత్తు పునరుద్ధరించాలని ఆందోళన చేశారు. ఉదయం లోపు చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పడంతో కాలనీ వాసులు ఆందోళన విరమించారు. మండలంలోని మోరుబాగల్ సబ్‌స్టేషన్ పరిధిలోని బీటీపల్లి, బళ్లేకట్ట, తాళికెర, మద్దనకుంట తదితర గ్రామాల్లో రెండు రోజులుగా వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్తు సరఫరా లేకపోవడంతో రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. మోరుబాగల్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులు ఆందోళన చేశారు. ఉదయం నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు వ్యవసాయ బోరుబావులకు విద్యుత్తు సరఫరా చేయలేదని రైతు సంఘం నాయకులు రంగేగౌడు, బీకే రంగనాథ్, రవి, హరీశ్, రంగదామప్ప, హనుమంతరాయప్ప ఆందోళన వ్యక్తం వ్యక్తం చేశారు.ఎలా కాపాడుకోవాలని వారు ప్రశ్నించారు. ఇలాంటి సమస్యలు పునరా వృతం అవుతున్నా పరిష్కరించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఏఎస్‌ఐ చంద్రశేఖర్ మోరుబాగల్‌కు చేరుకుని రైతులు, విద్యుత్తు శాఖ సిబ్బందితో మాట్లాడారు. లైన్‌మెన్ రామకృష్ణ తెగిపోయిన విద్యుత్తు లైన్‌ను సరిచేయించి సరఫరాను పునరుద్ధరించారు.

## దాహం కేకలు తప్పవా?



అనంతపురం:ఉమ్మడి అనంత జిల్లాకు తాగునీరు అందించే పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) ఒట్టిపోతోంది. గతంలో ఎన్నడూ లేనంతగా కనిష్ఠ నీటిమట్టం చేరుకుంది. ఉమ్మడి జిల్లాలో సగానికిపైగా గ్రామాలకు తాగునీరు అందించే ప్రాజెక్టు కళ్లముందే ఎండిపోతున్నా పాలకులు, అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించడం లేదు. హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను పీఏబీఆర్‌కు మళ్లించే అవకాశం ఉన్నా ఆ దిశగా కనీస ప్రయత్నం చేయడం లేదు. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హంద్రీనీవా నీటిని చిత్తూరు జిల్లాకు తరలిస్తుంటే చోద్యం చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరిస్థితి ఇలానే ఉంటే వేసవిలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో దాహం కేకలు తప్పవని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే పలు గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. హెచ్చెల్సీ నుంచి తుంగభద్ర జలాలను పీఏబీఆర్‌కు మళ్లించే లింకు కాలువ అధ్వానంగా మారింది. దీని ద్వారా 1,200 క్యూసెక్కుల నీటిని తరలించే అవకాశం ఉంది. కాలువ సరిగా లేకపోవడంతో 120 క్యూసెక్కులకు మించి తీసుకోలేదు. పీఏబీఆర్ ఒట్టిపోవడానికి ఇదీ ఓ కారణమే. కాలువ మరమ్మతులకు రూ.60 కోట్లతో అంచనాలు రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. మూడేళ్లు కావస్తున్నా ఇప్పటివరకు అనుమతులు రాలేదు. మరమ్మతులు పూర్తయి ఉంటే ఈ పరిస్థితి దాపురించేది కాదని అధికారులు పేర్కొంటున్నారు. వైకాపా ప్రభుత్వం జలాశయం నిర్వహణకు కనీస నిధులు కేటాయించకపోవడంతో లీకేజీ అధికమైంది. కుడి కాలువ పక్కనున్న సూయిజ్ గేట్లు మరమ్మతుకు గురై దాదాపు 1.5 టీఎంసీల నీరుగా వృథాగా పోయింది. ప్రధాన గేట్లు, పవర్ ప్లాంటు వద్ద లీకేజీ, సీపేజీ, ఆవిరి కావడం కారణంగా నిత్యం 100 క్యూసెక్కులు వృథా అవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు

## భారీగా ఉపాధి కూలీల తగ్గింపు



కళ్యాణదుర్గం:వలసల నివారణను కట్టడిచేసేందుకు ఎన్నోఏళ్లుగా కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలోని కొత్త నిబంధనల పట్ల కూలీలు ఆందోళన చెందుతున్నారు. పేదలకు బాసటగా ఉండాల్సిన ఈ పథకం స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నారు. గ్రామాల్లోని ప్రతి కుటుంబానికి ఏడాదికి వంద రోజులు పని కల్పించాలన్న లక్ష్యం నీరుకారనుంది. ప్రధానంగా కరవు ప్రాంతమైన రాయలసీమకు నష్టం ఎక్కువని చెబుతున్నారు. అనంతపురం జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో 577 పంచాయతీలు ఉన్నాయి. గతంలో 4,84,396 మంది జాబ్‌కార్డులు కలిగిన ఉపాధి కూలీలు ఉండగా.. ప్రస్తుతం 3,02,609 ఉన్నట్లు అధికారుల తాజా లెక్కలు చెబుతున్నాయి. జాబ్ కార్డు, బ్యాంకు ఖాతా, కూలీ ఆధార్ కార్డుతో అనుసంధానం చేయాలని కొత్త నిబంధనలు కేంద్ర ప్రభుత్వం విధించింది. దీని వల్ల కూలీల సంఖ్య తగ్గింది. గతంలో పనులకు వచ్చే కూలీలను దస్త్రాల్లో సంతకాలు చేయించేకొనేవారు. పనులకు రాకున్నా దస్త్రాల్లో కూలీల సంఖ్య ఉండేది. కొత్త నిబంధన ప్రకారం పనులు చేసే చోట తప్పకుండా కూలీ ఫొటో తీయాలి. కూలీల సంఖ్య తగ్గించి పథకానికి గండి కొడుతున్నారని కార్మిక సంఘాల నాయకులు తప్పు పడుతున్నారు. కూలీలకు అవగాహన లేని తనాన్ని ఆసరా చేసుకొని జాబ్‌కార్డులు తొలగించడం సరికాదని పేర్కొన్నారు. ఉపాధిహామీ పథకంలో కొత్త విధానాలతో పని చేసే కూలీలకు మంచి అవకాశాలు ఉంటాయి. ఇష్టానుసారంగా కార్డులు పొందిన వారిని తొలగించి ఉండవచ్చు. ఉపాధి పనులు చేయించే సిబ్బందికి, అధికారులకు ఒత్తిళ్లు తగ్గుతాయి. పనులు చేసేచోట కూలీ ఫొటో తీయాలి. దీంతో అనర్హులకు చోటు ఉండదు. కూలీలకు త్వరలోనే బిల్లులు అందుతాయి.

## విజ్ఞానం.. విస్తృత చైతన్యం



శాస్త్ర పరిశోధనలో దీని ఉపయోగం ఎక్కువే. దీనిపైపాఠశాల స్థాయి విద్యార్థులకు అవగాహన కల్పించడం తనవంతు బాధ్యతగా తిరుపతి ఐఐటీ గుర్తించింది. జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) విద్యార్థి దశ నుంచే పిల్లల్లో శాస్త్ర పరిశోధనలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉండటంతో వారు ఉన్నత చదువులు చదివే సమయానికి మరింతగా తర్ఫీదు పొందే అవకాశం ఉంటుంది.శ్రీకాళహస్తి, ఏర్పేడు, న్యూస్‌టుడే: సైన్స్ నానాటికీ కొత్త పుంతలు తొక్కుతోంది. విజ్ఞానాన్ని వీలైనంతగా విద్యార్థులకు చేరువ చేసేందుకు.. వారిని చైతన్యవంతులుగా తీర్చిదిద్దేందుకు తిరుపతి ఐఐటీ కృషి చేస్తోంది. ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో భాగంగా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా పాఠశాల స్థాయి విద్యార్థులను ఐఐటీకి ఆహ్వానించి.. అద్భుతమైన పరిశోధనలకు ఉపకరించే పరికరాలు, సైన్స్ సాధనలో ఎక్కువగా వినియోగించే యంత్రాలకు సంబంధించి ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారిలో విజ్ఞానాభివృద్ధికి కృషి చేస్తోంది. విద్యార్థి దశే కీలకం..: ఏదైనా ఉన్నత చదువులు చదవాలంటే ప్రాథమిక విద్యార్థి దశ పునాది వంటిది. అది గట్టిగా ఉంటే ఉన్నత స్థాయికి వెళ్లేందుకు ఎన్నో అవకాశాలు దక్కించుకోవచ్చు. ఇదే విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సాంకేతిక విద్యతో పాటు శాస్త్ర పరిశోధన అన్నది కీలకంగా మారింది.

## తెల్లదోమతో ఆయిల్ పామ్‌కు నష్టం



పెద్దాపురం: ఆయిల్‌పామ్ సాగుచేస్తే మంచి గిట్టుబాటు ధర ఉండడంతో రైతులు ఈ పంట వేసేందుకు ముందుకు వచ్చారు. రానురాను ఈ పంటపై పెట్టుబడి ఎక్కువగానూ, ఆదాయం తక్కువగానూ రావడంతో మెట్ట ప్రాంతంలోని రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాకినాడ జిల్లాలో పెద్దాపురం, ప్రత్తిపాడు, జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి, తూర్పుగోదావరి జిల్లాలో అనపర్తి, రంగంపేట, రాజానగరం, బిక్కవోలు తదితర ప్రాంతాల్లో ఈ పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఈ పంట సాగుచేయడానికి ఎకరానికి మోటారు మరమ్మతులు, ఇతర ఖర్చులు అన్నింటికీ కలిపి సుమారు రూ.40వేలు వరకు పెట్టుబడి అవుతోంది. ఈ పంటకు అధికంగా పొటాష్ ఎరువులు ఉండాలి. గతంలో బస్తా పొటాష్ ధర రూ.900 ఉండేది. ప్రస్తుతం దాని ధర రూ.1,700గా ఉంది. దీంతోపాటు బోరాన్, మెగ్నీషియం వంటి ఇతర ఎరువుల ధరలు కూడా బాగా పెరిగాయి. ఈ క్రమంలో రైతులు ఆయిల్‌పామ్ వేసేందుకు వెనుకంజ వేస్తున్నారు. జామ, మందారం వంటి పంటలపైనే కాకుండా ఆయిల్‌పామ్ పంటలపై కూడా ఈ తెల్లదోమ ఆశించింది. దీంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. ఎకరానికి దిగుబడి 10 టన్నుల వరకు వచ్చేది. ఈ వైరస్ వలన ఇప్పుడు కేవలం 6 నుంచి 7 టన్నులే వస్తుంది.

## రేషన్ బియ్యం సక్రమంగా ఇవ్వలేదని ఆందోళన



మడకశిర:నెలనెలా బియ్యం సక్రమంగా ఇవ్వడం లేదని, ఒక పక్క డీలరు, మరో పక్క ఎండీయూ వాహనదారుడితో ఏగలేకపోతున్నామని మడకశిర మండలం సిద్ధగిరి ఎస్సీ కాలనీ రేషన్ కార్డుదారులు వాపోయారు. మెళవాయి గ్రామ సచివాలయం ఎదుట ఈ డీలరు మాకొద్దంటూ బియ్యం కార్డులతో ధర్నా చేశారు. ఎండీయూ వాహనం ఎప్పుడొస్తుందో ఎప్పుడు పోతుందో తెలియడంలేదు. డీలరు వద్దకు వెళ్తే కార్డులు విసిరేస్తున్నారని, వేరేచోటకు వెళ్లి తీసుకోవాలని చెబుతున్నారని, ఇతర గ్రామాలకు వెళ్లి బియ్యం అడిగితే మీ డీలరు దగ్గరికే వెళ్లాలని ముప్పతిప్పలు పెడుతున్నారని వాపోయారు. ఎండీయూ వాహనదారుడు తూకాల్లో అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్డుదారులు, వాలంటీరు సుబ్బమ్మ మాట్లాడుతూ మూడు నెలలుగా బియ్యం సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. ఈ నెల కోటా బియ్యం 16వ తేదీ అయినా ఇవ్వలేదని ధర్నా వద్దకు వచ్చిన ఎంపీటీసీ సభ్యురాలు భర్త రామచంద్ర, సర్పంచి రంగనాథ్‌కు తెలిపారు. ఎండీయూ వాహనదారుడిపై సర్పంచి మండిపడ్డారు. సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని బుధవారం తహసీల్దారుకు అందించనున్నట్లు కార్డుదారులు తెలిపారు.

## ఉద్యమాన్ని నీరుగార్చేందుకే ఎస్మా ప్రయోగం




పుట్టపర్తి : ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మా చట్టం ప్రధాన ఉద్దేశం.. సమ్మె విరమించాలన్నదేనని ఏపీ అంగన్‌వాడీ, ఆయా వర్కర్ల యూనియన్ ఆరోపించింది. అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెను నిషేధిస్తూ ప్రభుత్వం సంజాయిషీ కోరుతూ ఈనెల 6న నోటీసులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిన క్రమంలో అంగన్‌వాడీలు తమ అభిప్రాయాన్ని తెలుపుతూ పుట్టపర్తిలోని సీడీపీవో కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీడీపీవో గాయత్రికి సంజాయిషీ ప్రతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సమ్మె నిషేధిస్తూ జారీ చేసిన నోటీసులు అంగన్‌వాడీ కార్యకర్తలకు వ్యక్తిగతంగా ఇవ్వలేదని, ఉమ్మడిగా మీరు అని సంబోధించడంతో నోటీసుకు అర్థం లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం చెబుతున్నట్లు తాము గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించలేదన్న నెపాన్ని తోసిపుచ్చారు. ప్రభుత్వం తన లోపాలను కప్పిపుచ్చుకొనేందుకే తమపై ఆరోపణలు చేస్తోందని వాపోయారు. ప్రభుత్వం డిమాండ్లు తీరుస్తేనే సమ్మె విరమించి విధుల్లో చేరతామని స్పష్టం చేశారు.

## నెలాఖరులోపు 'రైతుబంధు' పూర్తి:మంత్రి తుమ్మల

నందిపేట్, : ఎన్ని ఇబ్బందులు ఎదురైనా రైతు డిక్లరేషన్‌ను అమలు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నెలాఖరులోపు రైతుబంధు ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు. ఆర్థికంగా కష్టమైనా రుణమాఫీ ప్రక్రియ కూడా చేపడతామన్నారు. నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని మంత్రి తుమ్మల ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ శిష్యుడిగా రాజకీయాల్లోకి వచ్చిన తాను రైతు పక్షపాతిని అని, రైతుల అవసరాలు,కష్టాలు తీర్చడానికి,అన్నదాతల భవిష్యత్తు కోసం ఎంత కష్టమైనా,ఇబ్బంది అయి నా రైతు డిక్లరేషన్‌లో ప్రకటించిన హామీలన్నీ అమలు చేస్తామని చెప్పారు.

# గంగలో కలిసిన హామీలు



అనకాపల్లి : మాడుగుల మండలం జలాశయాలకు పెట్టింది పేరు. చుట్టూ నీటి వనరులున్నా వాటిని సద్వినియోగం చేసుకోలేక పోతున్నారు. అయిదు చిన్నతరహా జలాశయాలను పూర్తి చేయలేక 30 వేల ఎకరాల ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీటిని అందించలేని దుస్థితిలో పాలకులున్నారు. ఎన్నికల ముందు మీ భూములు సస్యశ్యామలం చేసేస్తామని హామీలు ఇవ్వడం.. అధికారంలోకి వచ్చాక ఆ హామీలను గంగలో కలిపేయడం పరిపాటిగా మారిపోయింది. మాడుగుల, రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లో 22,500 ఎకరాలకు సాగు నీరందించడానికి నిర్మించిన పెద్దేరు జలాశయం నేటికీ శివారు భూములకు నీరందించలేక పోతోంది. ఈ జలాశయం ప్రధాన కాలువ పూడికతో నిండిపోవడంతో ఆయకట్టుకు సాగునీరందడం గగనమైపోతోంది. రిజర్వాయర్ గేట్లు లీకేజీలతో ఉన్నాయి. విద్యుత్తు సౌకర్యం లేదు.. జనరేటరుతో గేట్లు ఎత్తడానికి డీజిల్ సొమ్ములు కూడా లేవు. సిబ్బందే చేతి చమురు వదిలించుకుంటున్నారు. జలాశయం స్పిల్‌వేపై 33 విద్యుద్దీపాలు వేశారు. అవి నేటికీ వెలగడం లేదు. ఎపుడైనా గేట్లు ఎత్తాల్సి వస్తే సిబ్బంది చీకటిలోనే అవస్థలు పడుతున్నారు. కాలువలు సరిగా లేక వరద నీటిని వృథాగా నదిలోకి వదిలేస్తున్నారు తప్ప సద్వినియోగం చేసుకోలేకపోతు న్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. పెద్దేరు కుడి కాలువ నుంచి 22 కి.మీ మేర సిమెంటు లైనింగ్ చేయడానికి, ఎడమ కాలువ నిర్మించడానికి ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు రూ. 100 కోట్ల మంజూరు చేసినట్లు జీఓ తెచ్చారు. ప్రభుత్వం గద్దెనెక్కిన నాలుగేళ్ల తర్వాత ఈ జీఓ తేవడం ఎన్నికల జిమ్మిక్కుగానే స్థానికులు భావిస్తున్నారు. మంత్రికి చిత్తశుద్ధి ఉంటే సర్కారు కొలువుదీరిన తొలి ఏడాదో, రెండో సంవత్సరంలోనే పెద్దేరు ఆధునికీకరణకు పట్టుబట్టి మంజూరు చేయించేవారనే వాదన వినిపిస్తోంది. ఎన్నికలకు ఆరు నెలలు ముందు రూ.100 కోట్లు మంజూరు చేసేశాం అని చెప్పి రైతులను మభ్యపెట్టే ప్రయత్నమే తప్ప ఇందులో అధికార పార్టీనేత గొప్పమీ లేదని విపక్ష నేతలంటున్నారు. కేవలం పరిపాలన, సాంకేతిక అనుమతులే వచ్చాయి తప్ప బడ్జెట్‌లో పైసా నిధులు కేటాయించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. తాటిపర్తి వద్ద తారకరామా జలశయం మూడు దశాబ్దాల కిందట శంకుస్థాపన చేశారు. నేటికీ పనులు పూర్తికాక అసంపూర్తిగానే ఉండిపోయింది. మాడుగుల, కె.జె.పురం, ముకుందపురం, కోటపాడు, వంటర్లపాలెం పరిధిలో 5 వేల ఎకరాలకు ఈ జలాశయమే ఆధారం. సగం వరకు కాలువ నిర్మించి వదిలేశారు. అందులోనూ పూడిక తేలి ఎప్పటిలా నీరంతా తాచేరులోకి పోతోంది. తొలుత రూ.4 కోట్ల అంచనాతో మొదలుపెట్టిన ఈ పనులు కాలయాపన కారణంగా రూ. 21.75 కోట్లకు అంచనా విలువ పెరిగిపోయింది. ఆ మేరకు ప్రతిపాదనలు పంపించారు. వీటికి ఎప్పుడు ఆమోదముద్ర పడుతుందో మరి..

# పట్టణ పేదలకువైద్య సేవలేవీ?




తెనాలి: వైద్య, ఆరోగ్య సేవలను పట్టణ పేదలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో చేపట్టిన యూపీహెచ్‌సీ(అర్బన్ హెల్త్ కేంద్రాల) నూతన భవనాల నిర్మాణ పనులు నత్తను తలపిస్తున్నాయి. వీటిని నియోజకవర్గ కీలక నేత సిఫార్సు చేసిన గుత్తేదార్లకు ఇచ్చి తప్పు చేశామని జిల్లా ఇంజినీరింగ్ అధికారులు తలపట్టుకోవడం గమనార్హం. ఇప్పటికే ప్రారంభించిన వాటిని నిబంధనల మేరకు నిర్మించకపోవడంతో లోపాలు బయటపడ్డాయి. పగుళ్లిచ్చిన నూతన భవనాలు, రోగులకు కల్పించని వసతుల తదితరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన యూపీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నా రు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణ పేదలకు వైద్య సేవలు చేరువ చేయాలని అదనంగా జిల్లాకు 32 యూపీహెచ్‌సీల భవనాలు మంజూరు చేసింది. వీటికి కార్పొరేషన్, మున్సిపల్ అధికారులు టెండర్లు పిలిచి గుత్తేదార్లను ఎంపిక చేసి వర్క్ ఆర్డర్ ఇచ్చారు. వారు కొన్ని చోట్ల పనులు పూర్తి చేశారు. జిల్లా పాలనాధికారి గతేడాది మార్చిలో తెనాలి పాత ప్రభుత్వాసుపత్రిలోని యూపీహెచ్‌సీ భవన ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతూ మరో రెండు నెలల్లో మిగిలిన మూడు భవనాలు ప్రారంభించుకుందామన్నారు. గుత్తేదారులు ఈ ఏడాది జనవరికి కూడా వాటి నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడం గమనార్హం. జిల్లా ఇంజినీరింగ్ అధికారి నేత ఒత్తిడికి తలొగ్గి ఎక్కువ యూపీహెచ్‌సీ భవనాల టెండర్ పనులు ఒకే గుత్తేదారుకు ఖరారు చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా ఇంజినీరింగ్ అధికారి వచ్చి వాటిని పరిశీలించారు. వాటిని వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని, జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి ప్రారంభించే సమయానికి ఆ లోపాలు పైకి కనిపించకుండా మక్కు పెట్టించి చేతులు దులుపుకొన్నారు ఇంజినీరింగ్ అధికారులు. మరుగుదొడ్ల గోడలు, భవనాల శ్లాబు కింద భాగంలో చుట్టూ ఏర్పడిన పగుళ్లు మరింత పెద్ద రంధ్రాలుగా మారి వెక్కిరిస్తున్నాయి. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్తే ప్లానునే తప్పుపట్టారు. ఈ పరిస్థితి జిల్లాలో ఏ కార్పొరేషన్, మున్సిపాలిటీలో లేదు. ఈ కేంద్రాలకు వచ్చే వృద్ధులు పడిపోకుండా ఆసరాగా ఉండటానికి స్టీలు రాడ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా చేయలేదు. మాగాణి భూముల్లో నిర్మించిన కేంద్రానికి చుట్టూ మెరకగా ఎర్రమట్టి తోలించకుండా వదిలేశారు. ఓ కేంద్రం గోడ, శ్లాబు మధ్య మనుషులు లోపలికి సులభంగా వెళ్లేలా ఖాళీగా ఉండడం పై సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఆ భవనాల నిర్మాణ పనుల పరిశీలనకు వచ్చిన జిల్లా వైద్యాధికారులు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ అవన్నీ సాంకేతికమైనవని ఇంజినీరింగు అధికారులే చూసుకోవాలన్నారు. వైద్యాధికారులు ఆ లోపాలను తమ దృష్టికి తీసుకురాలేదన్నారు. జిల్లాకు మంజూరైన 32 భవనాల్లో ఒక్కో దానికి రూ.80లక్షలు నిధులు కేటాయించామన్నారు. అదనంగా అయ్యే నిధులు కేటాయించి గుంటూరు, పొన్నూరు, మంగళగిరి, తాడేపల్లి అధికారులు పూర్తి చేసి ప్రారంభించామన్నారు. తెనాలిలో మూడు తప్ప మిగిలినవి పూర్తయ్యాయన్నారు.

# వెల్లువలా విదేశీ మద్యం



విజయవాడ : హరియాణా... ఈ ఉత్తరాది రాష్ట్రం నుంచి విదేశీ మద్యా న్ని రైళ్ల ద్వారా తీసుకొచ్చి గుట్టుచప్పుడు కాకుండా రహస్యంగా దాస్తున్నారు. ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ అయితే చాలు ఎంత ధరైనా ఇచ్చి కొనేందుకు మొగ్గు చూపుతున్నారు. ఒక్కో సీసాపై వేల రూపాయలు లాభం వేసుకున్నా హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయి. విదేశీ మద్యం అమ్మకాలతోనే మద్యం మాఫియా రూ.లక్షలు సంపాదిస్తోంది. విశ్రాంత సైనికోద్యోగి కనుసన్నల్లో జరుగుతున్న ఈ వ్యాపారానికి అధికార పార్టీ నేత ఒకరు వత్తాసు పలుకుతున్నారు. ఇటీవల విజయవాడ పోలీసుల తనిఖీల్లో భారీగా విదేశీ మద్యం పట్టుబడగా ప్రధాన సూత్రధారి పరారయ్యాడు. ఇతడి స్వస్థలం వేమూరు మండలం జంపని. అతడిని వదిలేయాలని సదరు అధికార పార్టీ నేత పోలీసులపై ఒత్తిడి తెస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. అధికార పార్టీ నేతల అండదండలతో మద్యం మాఫియా వ్యాపారం మూడు సీసాలు... ఆరు క్వార్టర్లుగా యథేచ్ఛగా సాగుతోంది. తీగ లాగితే కదిలిన డొంక... : విజయవాడ నగరంలో మహాత్మాగాంధీరోడ్డులోని ఒక స్టార్ హోటల్ సమీపంలో ఈ నెల మొదట్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో వేమూరు మండలం జంపని గ్రామానికి చెందిన కోగంటి విజయసాయి దొరికాడు. ఇతని వద్ద 10 విదేశీ మద్యం సీసాలు దొరికాయి. ఇతనిని విచారించగా ఒక గోదాములో దాచి ఉంచిన 342 విదేశీ మద్యం సీసాలు వెలుగు చూశాయి. విచారణలో.. రైలులో హరియాణా నుంచి తెస్తున్నట్లు తేలింది. ఇలా తెచ్చిన మద్యాన్ని గురునానక్‌కాలనీలో ఒక ఇంట్లో దాచి ఉంచి గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. భారీ లాభాలు.. : పోలీసులకు దొరికిన ఈ విదేశీ మద్యం సీసా ఒక్కోటి రూ.7 వేలు పైచిలుకే పలుకుతోంది. పట్టుబడిన 352 సీసాల విలువ రూ.25 లక్షలుగా అధికారులు తేల్చారు. ఈ సీసాలపై రకాన్ని, డిమాండ్‌ను ఒక్కోదానిపై రూ.1,000–1,600 లాభం వేసుకుని విక్రయిస్తున్నారు. ఆదాయం రూ.లక్షల్లో ఉండటంతో ఇతర రాష్ట్రాల నుంచి గుట్టుగా తెస్తున్నారు. దీనికి అధికార పార్టీ నాయకులు వత్తాసు పలుకుతున్నట్లు తెలుస్తోంది. బాక్సుల కొద్దీ అక్రమ మద్యం రైళ్లలో వస్తున్నా పోలీసులకు తెలియకపోవడం విశేషం.

# ఇంకా పరిశీలనలోనే..ఓటర్ల తుది జాబితా



నరసరావుపేట: ఓటర్ల తుది జాబితా ఈనెల 22న విడుదల చేస్తామని ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించింది. ఈసారైనా తప్పుల్లేని ఓటర్ల జాబితా రూపొందిస్తారా.. లేక అవే తప్పులు పునరావృతమవుతాయా? అన్న సందేహం అన్ని రాజకీయ పార్టీ నాయకుల్లో నెలకొంది. అయితే ఓటరు సవరణకు వచ్చిన దరఖాస్తులు ఇంకా పరిష్కరించాల్సినవి వేలల్లో ఉండడంతో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 12 వరకు స్వీకరించిన ఓటర్ల దరఖాస్తులను ప్రజల నుంచి స్వీకరించారు. ఇవి సవరణలు చేసి 22న విడుదల చేసే జాబితాలో పేర్లను చేరుస్తారు. అయితే ఇప్పటి వరకు సవరించాల్సిన ఫారం–6, ఫారం–7, ఫారం–8 దరఖాస్తుల సంఖ్య 12,601 వరకు ఉన్నాయి. సంక్రాంతి సందర్భంగా ఈనెల 13, 14, 15, 16 నాలుగు రోజులు సెలవులు రావడంతో ఇంకా 6 రోజులు మాత్రమే బీఎల్వోలకు ఉంది. ఈ తక్కువ సమయంలో దరఖాస్తులను ఎంత వరకు సవరిస్తారనేది పెద్ద ప్రశ్నగా ఉందని రాజకీయ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. వినుకొండ నియోజకవర్గంలో కుప్పలు తెప్పలుగా డబుల్ ఎంట్రీలు ఉన్నాయని, వాటిని తొలగించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని తెదేపా జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా వినుకొండ నియోజకవర్గంలో డబుల్ ఎంట్రీలు, మృతుల వివరాలు జాబితాలో కనిపిస్తున్నాయి. అంతేకాకుండా బీఎల్వోలుగా సచివాలయ ఉద్యోగులు ఉండడం వారంతా మొదటిసారిగా ఈ ఓటర్ల జాబితా సవరణలు చేయడం కూడా మరో కారణంగా చెబుతున్నారు. జనవరి 22న విడుదల చేసే తుది జాబితాలో ఎటువంటి తప్పులు ఉండకూడదని ప్రతిపక్షాలు పట్టుపడుతున్నాయి. ఎక్కడెక్కడ దొంగ ఓట్లు ఉన్నాయి? డబుల్ ఎంట్రీలు, మృతుల జాబితా.. ఇలా అన్నింటినీ ఆధారాలతో ఇప్పటికే అధికారులకు అందజేశారు. కనీసం తుది జాబితాలోనైనా ఎటువంటి తప్పులు లేకుండా ఉండాలని కోరుతున్నారు.

# 61వేల కార్డులకు సరకులు అందేనా..?



కాకినాడ:కాకినాడ జిల్లాలో జనవరి నెలకు సంబంధించి ఇంకా 61,371 బియ్యంకార్డులకు సరకులు అందలేదు. వీటి పంపిణీకి ఒక్కరోజే గడువు ఇచ్చారు. ఈ నెల 1 నుంచి 17 వరకు ఎండీయూ వాహనాల ద్వారా పేదలకు రేషన్ పంపిణీ చేపట్టారు. ఈసారి ప్రత్యేకంగా పంపిణీ పాయింట్లను నిర్దేశించారు. దీన్ని ట్రాకింగ్ చేశారు. యాప్‌లో నమోదు చేసినా, కొందరు ఎండీయూ ఆపరేటర్ల నిర్వాహకంతో చాలాచోట్ల పేదలకు సరకులు ఇవ్వలేదు. దీనిపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో జిల్లా అధికారుల అభ్యర్థన మేరకు పంపిణీ గడువును ఒకరోజు పెంచారు. బుధవారం రాత్రితో పంపిణీ గడువు ముగిసినప్పటికీ, గురువారం రాత్రి వరకు బట్వాడాకు అవకాశం కల్పించారు. దీనిపై అధికారులు పూర్తిస్థాయిలో దృష్టిసారించకపోతే ఈ నెలా పేదలు రాయితీ సరకులను నష్టపోవాల్సి వస్తుంది. ఉదయం 7 గంటల నుంచి వాలంటీర్ల పర్యవేక్షణలో సరకుల పంపిణీ జరిగాల్సి ఉన్నా.. సక్రమంగా చేపట్టలేదు. ఉదయం 11 గంటల వరకు కొన్ని ఎండీయూ వాహనాలు పంపిణీ పాయింట్లకు చేరని పరిస్థితి ఉంది. దీంతో చాలాచోట్ల పేదలకు సరకులు దక్కలేదు. జనవరి నెలకు సంబంధించి 6,53,715 కార్డులకు బియ్యం, కందిపప్పు, పంచదార, గోధుమ పిండి మంజూరు చేశారు. రాత్రి 8 గంటలకు 5,92,344 కార్డులకే సరకులు అందాయి. ఇంకా 61,371 కార్డులకు సరకులు ఇవ్వాలి. కేవలం 90.61 శాతం కార్డులకే సరకులు ఇచ్చారు. గురవారం ఒక్కరోజైనా అధికార యంత్రాంగం పంపిణీపై క్షేత్రస్థాయి పర్యవేక్షణ చేయకపోతే పేదలు నష్టపోవాల్సి వస్తుంది.

# తీర్మాణాలు సరే.. అమలేదీ?




అనంత :ఉమ్మడి అనంత జిల్లా అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాల్సిన జడ్పీ వివిధ కారణాలతో పరిపాలన పట్టు తప్పింది. ప్రతిపక్షం లేకపోవడం, అధికార పార్టీ ప్రజాప్రతినిధుల మధ్య విభేదాలతో అభివృద్ధి తీసికట్టుగా మారుతోంది. మొత్తం 63 మంది జడ్పీటీసీ సభ్యులు కాగా.. అందులో 61 మంది వైకాపాకు చెందిన వారే కావడం గమనార్హం. ఒకరు తెదేపా, మరొకరు స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. పరిపాలనలో తనదైన ముద్ర కనిపిస్తుందని అందరూ అనుకున్నా పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. జడ్పీకి ప్రత్యేకంగా నిధులు తెప్పించి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాల్సిన ప్రజాప్రతినిధులు ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. కేవలం ఆర్థిక సంఘం, సాధారణ నిధుల మినహాయిస్తే ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా ఎలాంటి నిధులు రావడం లేదు. జడ్పీ సమావేశాల్లో చేసిన తీర్మానాలు కూడా అమలు కావడం లేదు. అధికార పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎక్కువమంది ఉన్నా.. జడ్పీ ప్రగతిపై ఎవరూ పట్టించుకున్న దాఖలాలు కనిపించలేదు. పరిపాలనలో జోక్యం చేసుకుంటూ పెత్తనం చెలాయిస్తున్నారే తప్పా చేసిందేమి లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండేళ్ల జడ్పీ పాలనలో పలు తీర్మానాలు చేసినా కార్యరూపం దాల్చలేదు. ప్రతిపక్ష సభ్యులు లేకపోవడంతో సర్వసభ్య, స్థాయి సంఘ సమావేశాలు చప్పగా సాగుతున్నాయి. ఎలాంటి చర్చ లేకుండా మమ అనిపిస్తున్నారు. అడపాదడపా కొందరు సమస్యలపై గళమెత్తుతున్నా.. ఎలాంటి పరిష్కారం చూపలేకపోతున్నారు. నేడు బుధవారం జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. గ్రామీణ ప్రజలకు రక్షిత తాగునీరు అందించడానికి ప్లాంట్లు ఏర్పాటు చేయాలని 2022లో తీర్మానం చేశారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 80 ఆర్ఓ ప్లాంట్లు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఇందుకు రూ.7.02 కోట్లు ఖర్చవుతుందని అంచనాలు సిద్ధం చేసి టెండర్లు పిలిచారు. ఒక్కో ప్లాంటుకు రూ.3 లక్షల నుంచి 5 లక్షల వరకు వ్యయం అవుతుందని 15వ ఆర్థిక సంఘం, బీఆర్‌జీఎఫ్ నిధులు కేటాయించారు. ఈ ప్రక్రియ టెండర్ల దశలోనే ఉండటం గమనార్హం. కళ్యాణదుర్గం మండలానికి రూ.27 లక్షల విలువైన పనులు మంజూరు కాగా ఇప్పటి వరకు ఒక్కటీ పూర్తి కాలేదు. తొమ్మిది కల్వర్టుల నిర్మాణానికి టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకురాలేదు. రాజకీయ విభేదాలతో నిర్మాణాలు పూర్తిగా ఆగిపోయాయి. మౌక్తికాపురం–ఎగువపల్లి రహదారిలో ప్రతిపాదించిన కల్వర్టు నిర్మాణం ప్రతిపాదనల దశలోనే ఉంది.

# తప్పుల్లేని తుది ఓటర్ల జాబితా విడుదల చేయాలి



చిత్తూరు: తప్పులు లేని తుది ఓటరు జాబితా విడుదలకు చర్యలు చేపట్టాలని జిల్లా ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ ఆదేశించారు. జిల్లా అధికారులు, ఈఆర్వోలు, ఇతర అధికారులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఫారం–6,7,8కు సంబంధించి అన్ని రికార్డులు భద్రపరచాలన్నారు. ఫిర్యాదు దరఖాస్తులపై చేపట్టిన చర్యల వివరాల్ని సదరు దరఖాస్తుదారుడికి సమాచారం ఇవ్వాలన్నారు. ఓటరు జాబితా ప్రింటింగ్‌కు ఏర్పాట్లు చేసుకోవాలని, రాజకీయ పార్టీలకు ఓటరు జాబితా హార్డ్ కాపీ ఇవ్వాలని ఆదేశించారు. ఈ నెల 22న అధికారులు సమావేశాల్ని ఏర్పాటుచేసి తుది ఓటరు జాబితా ప్రకటించాలన్నారు. కలెక్టర్ షన్మోహన్, జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్ పాల్గొన్నారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా ఫారం–6, ఫారం–7, ఫారం–8 దరఖాస్తుల విచారణ ప్రక్రియ పూర్తయిందని డీఆర్వో రాజశేఖర్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్లు ఒకే చోట 1,400 మందికి పైగా ఉంటే మరో పోలింగ్ కేంద్రానికి ప్రతిపాదనలు పంపుతామని, ఈ నెల 22న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు భాస్కర్, పరదేశి, సురేంద్రకుమార్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

# సాగుతున్న.. తిరుపతి-చెన్నై హైవే పనులు



పుత్తూరు:తిరుపతి–చెన్నై జాతీయ రహదారి పెండింగ్ పనులు చూస్తే నత్తలు నవ్వుతున్నాయి. గతేడాది జులైలో తిరుపతి–చెన్నై హైవే పనులు ప్రారంభించారు. గతేడాది జులైలో పనులు ప్రారంభించారు. పనులు నేడు మందకొడిగా సాగుతున్నాయి. గుత్తేదారు ఆలస్యం చేసుండటంతో వాహన చోదకులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ అవి పూర్తి కాలేదు.. అసలు వీటిని ఎప్పటికి పూర్తిచేస్తారనేది దేవదేవుడికే ఎరుక. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా 2008లో భూసేకరణ చేపట్టారు. చంద్రగిరి సమీపంలోని కాలూరు క్రాస్ నుంచి చైన్నై వరకు 166 కిమీ మేర రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని 2009లో టెండర్లు పిలిచారు. ఆ పనులను ట్రాన్స్‌ట్రాయ్ గుత్తేదారు సంస్థ దక్కించుకుంది. 2010 జులై 12న అగ్రిమెంట్ చేసుకున్నారు. 2011 ఏప్రిల్ 7న పనులు ప్రారంభించారు. 2013 అక్టోబరు 2 నాటికి పూర్తి చేయాలనేది లక్ష్యం. రోడ్డు నిర్మాణానికి మొత్తం వ్యయం రూ.571 కోట్లు. ఈ మేరకు 2011లో పనులు ప్రారంభమయ్యాయి. గుత్తేదారు 2013 నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉన్నా అడుగు ముందుకు పడలేదు. అప్పట్లో ఆగిపోయిన పనులు ఎట్టకేలకు ప్రస్తుతం గతేడాది జులైలో పనులు ప్రారంభించారు. పనులు నేడు మందకొడిగా సాగుతున్నాయి. గుత్తేదారు ఆలస్యం చేసుండటంతో వాహన చోదకులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. పెండింగ్ పనులివే.. చంద్రగిరి సమీప కాలూరు క్రాస్ వద్ద బిడ్జి నిర్మాణం, కేఎల్ఎం ఆస్పత్రి సమీప రైల్వే వంతెన, వడమాలపేట మండలం పాదిరేడు వద్ద వంతెన నిర్మాణం, పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని గోవిందపాళెం వద్ద పనులు అలానే ఉన్నాయి. గాజులమండ్యం, వడమాలపేట వద్ద రోడ్డు పనులు ఆగిపోయాయి. వీటిని పూర్తిచేసేందుకు రూ.121కోట్లు విడుదల చేశారు. ఆయా పనులను20శాతం తక్కువకు ఓ గుత్తేదారు సంస్థ దక్కించుకుని ప్రారంభించింది. ప్రస్తుతం వడమాలపేట మండలం పాదిరేడు వద్ద ప్రారంభించింది. ఇప్పటికి ఆరు నెలలు గడిచినా పూర్తి కాలేదు. పాదిరేడు వద్ద వంతెన, స్థానిక టోల్‌గేట్ వద్ద వంతెనల నిర్మాణం పూర్తి చేశారు. కాలూరు క్రాస్, కేఎల్ఎం ఆస్పత్రి వద్ద వంతెన పనులు తాజాగా ప్రారంభించడం గమనార్హం. తిరుపతి–చెన్నై హైవే పనులు ఆలస్యం అవుతుండటంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు చొరవ చూపాల్సి ఉంది.

# ప్రమాదం చెంతన.. పెన్నానది వంతెన



పెనుకొండ :మూడు దశాబ్దాల క్రితం పెన్నానదిపై నిర్మించిన వంతెన ప్రస్తుతం ఇనుప చువ్వలు తేలి, రక్షణ స్తంభాలు విరిగిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో కర్ణాటకలోని తుమకూరు, మంగళూరు, ధర్మస్థలం వెళ్లే వాహనాలు ఎక్కువగా ప్రయాణిస్తుంటాయి. రోజూ దాదాపు వెయ్యికిపైగా వాహనాలు
ఈ మార్గంలో ప్రయాణిస్తుంటాయి.
గతేడాది నవంబరు 27న ఈ వంతెనపై ఇనుపచువ్వలు తప్పించే క్రమంలో మినీబస్సు అదుపుతప్పి రక్షణ వంతెనను ఢీకొంది. ఇనుప చువ్వలు టైర్లకు గుచ్చుకొని తరచూ వాహనాలు పంక్చరవడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మార్గంలో ప్రయాణిస్తుంటాయి. గతేడాది నవంబరు 27న ఈ వంతెనపై ఇనుపచువ్వలు ఈ విషయంపై ఆర్అండ్‌బీ డీఈ నాగరాజు మాట్లాడుతూ ప్రస్తుతం మడకశిర రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని, త్వరలోనే వంతెనపై తారురోడ్డు వేయిస్తామన్నారు. రక్షణ స్తంభాలు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

## పుష్ప-2లో సమంతకు బదులు శ్రీలీల.. డ్యాన్స్ ఇరగదీస్తుందా?



స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ పుష్ప: ది రైజ్‌లోని ఊ అంటావా పాటలో తన మంత్రముగ్ధులను చేసే నృత్యంతో ప్రేక్షకులను ఉర్రూతలూగించిన సమంతా రూత్ ప్రభు, సీక్వెల్.. పుష్ప సీక్వెల్.. పుష్ప 2:ది రూల్‌లో యువ నటి శ్రీలీల డ్యాన్స్ ఉన్నట్లు సమాచారం. సీక్వెల్‌లో శ్రీలీల ప్రత్యేక డ్యాన్స్ ఉంటుందని, శ్రీలీల పాట ద్వారా సినిమాకు ప్రత్యేక ఆకర్షణను తీసుకురావాలని భావిస్తున్నారు. పుష్ప: ది రైజ్‌లోని ఐటెమ్ నంబర్‌లో అత్యుత్తమ నటనకు పేరుగాంచిన సమంతా ఊ అంటావా పాటలో కనిపించినందుకు రూ.5 కోట్లు చెల్లించినట్లు సమాచారం. అయితే, పుష్ప-2లో డ్యాన్స్ నంబర్ కోసం శ్రీలీల ఎంపిక చేయబడిందని.. ఇందుకోసం రూ. 2 కోట్లు చెల్లించినట్లు టాక్ వస్తోంది. సుకుమార్ దర్శకత్వం వహించిన పుష్ప 2: ది రూల్ ఆగస్ట్ 15, 2024న విడుదల కానుంది. ఈ చిత్రంలో అల్లు అర్జున్, రష్మిక మందన్న, ఫహద్ ఫాసిల్, జగపతి బాబు, ప్రకాష్ రాజ్, సునీల్, అనసూయ తదితరులు నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా బడ్జెట్ 500 కోట్ల రూపాయలు. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం సమకూర్చగా, మిరోస్లా కుబా బ్రోజెక్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, కార్తీక శ్రీనివాస్-రూబెన్ ఎడిటర్లుగా పనిచేస్తున్నారు. పుష్ప-2లో శ్రీలీల ఐటమ్ గర్ల్‌గా ఇరగదీస్తుందని పుకార్లు వినిపిస్తున్నాయి. కాగా శ్రీలీల ప్రస్తుతం మహేష్ బాబుతో కలిసి గుంటూరు కారం సినిమాలో నటించింది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం జనవరి 12, 2024న విడుదలైంది. ఈ చిత్రం 200 కోట్ల రూపాయల బడ్జెట్‌తో తెరకెక్కింది.

# ‘రాజాసాబ్’గా రెబల్ స్టార్ ప్రభాస్!

ప్రభాస్ హీరోగా దర్శకుడు మారుతి రూపొందిస్తున్న చిత్రానికి ‘రాజా సాబ్’ అనే పేరు నిర్ణయించారు. పీపుల్ వీరిడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. ప్రభాస్ ఇప్పటిదాకా చేయని రొమాంటిక్ హారర్ జానర్‌లో ‘రాజా సాబ్’ చిత్రాన్ని దర్శకుడు మారుతి రూపొందిస్తుండడంతో సినిమా వీరిద అందరిలోనూ ఆసక్తి నెలకొంది. సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. వింటేజ్ లుక్‌లో లుంగీ కట్టుకున్న ప్రభాస్ అందర్నీ ఆకట్టుకుంటున్నారు. సరదాగా, రొమాంటిక్‌గా సాగే క్యారెక్టర్ లుక్‌లో ‘డార్లింగ్’ ప్రభాస్‌ను చూడడంతో అభిమానులతో పాటు సినిమా లవర్స్ అందరికీ ఫ్రెష్ ఫీల్ కలుగుతోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లోనే ఒక కలర్‌ఫుల్ సినిమా చూడబోతున్న భావనని మారుతి కలిగించారు. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ‘రాజా సాబ్’ ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రానికి కార్తీక్ పళని



సినిమాటోగ్రఫీని, తమన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ‘మగధీర’, ‘బాహుబలి’ చిత్రాలకు వి.ఎఫ్.ఎక్స్ అందించిన కమల్ కన్నన్ ఈ సినిమాకు వర్క్ చేస్తున్నారు.

## హనుమాన్ దెబ్బకు ఊపందుకున్న రామాయణం



బాక్సాఫీస్ వద్ద హనుమాన్ సునామిని చూసి ఎవరికీ నోట మాట రావడం లేదు. పండగ సెలవులయ్యాక అందరి కలెక్షన్లు తగ్గాయి కానీ దీనికి మాత్రం రివర్స్ లో హౌస్ ఫుల్స్ ప్లస్ అదనపు స్క్రీన్లు తోడవుతున్నాయి. మొన్నటిదాకా టికెట్ రేట్లు, మహేష్ బాబు బ్రాండ్ వల్ల ఆధిపత్యం చూపించిన గుంటూరు కారం ఇప్పుడు వెనుకబడిపోయింది. ప్రధాన కేంద్రాల్లో సైతం హనుమాన్ ఫిగర్లే పెద్దగా కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారి ప్లాన్ చేసుకున్న ప్యాన్ ఇండియా మూవీ రామాయణంకి హనుమాన్ ఫలితం గొప్ప భరోసా ఇచ్చేసిందని అక్కడి జనాల ఓపెన్ కామెంట్. రన్బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా మొత్తం మూడు భాగాల్లో తీయాలని నితీష్ ప్లాన్ చేసుకున్నారు. క్యాస్టింగ్ ని అఫీషియల్ గా అనౌన్స్ చేయలేదు కానీ ఆల్రెడీ గ్రీన్ సిగ్నల్ తీసుకోవడం జరిగిందని ఇన్ సైడ్ టాక్. ఎంతలేదన్నా అయిదు వందల కోట్లకు పైగానే బడ్జెట్ అవుతుందని అంటున్నారు. రావణుడిగా నటించేందుకు కెజిఎఫ్ యష్ తో జరుపుతున్న ముంతనాలు ఇంకా కొలిక్కి రాలేదు. అతను టాక్సిక్ లో బిజీ అయిపోయాడు. ఒకవేళ ఒప్పుకున్నా డేట్ల సమస్య వచ్చేలా ఉంది. దీంతో రాఖీ భాయ్ ఈ ప్రాజెక్టులో చేరడం మీద ఇంకా అనుమానాలు తొలగిపోలేదు. పరిమిత బడ్జెట్ లో మంచి క్వాలిటీ విజువల్ ఎఫెక్ట్స్ తోనే హనుమాన్ ఈ స్థాయి విజయం సాధించినప్పుడు సరైన రీతిలో రామాయణాన్ని తీస్తే ఏ స్థాయి ప్రభంజనం ఉంటుందో వేరే చెప్పాలా. ఆదిపురుష్ మీద నెగటివిటీ చూశాక చాలా మంది ఫిలిం మేకర్స్ ఆ ఇతిహాసం జోలికి ఇప్పట్లో వెళ్ళకపోవడం మంచిదనుకున్నారు.

# లేటెస్ట్ హిట్ ‘హనుమాన్’పై సమంత రివ్యూ



చిన్న సినిమాగా ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్‌ను సొంతం చేసుకుంది ‘హనుమాన్’ సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ చిత్రంపై సినీ, రాజకీయ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

తాజాగా స్టార్ హీరోయిన్ సమంతఈ సినిమా రివ్యూను పోస్ట్ చేశారు. “మనల్ని చిన్న పిల్లల్ని చేసే సినిమాలు ఉత్తమమైనవి. ‘హనుమాన్’లో ప్రతి అంశం నన్ను ఆకట్టుకుంది. విజువల్స్, కామెడీ, సంగీతం.. ఇలా ఎన్నో అద్భుతమైన అంశాలతో వెండితెరపై హనుమంతుడు చేసిన మ్యాజిక్ ఈ చిత్రం. ఇంత గొప్ప మూవీని తీసినందుకు ప్రశాంత్ వర్మకు ధన్యవాదాలు. దీని సీక్వెల్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. తేజ సజ్జా తన నటనతో అందరినీ ఆశ్చర్యపరిచాడు. అమాయకుడైన హనుమంతు పాత్ర ఈ సినిమాకు హార్ట్. వీఎఫ్ఎక్స్ ఎఫెక్ట్‌లు సినిమాకు మరింత అందాన్నిచ్చాయి” జనాల ఓపెన్ కామెంట్. రన్బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా మొత్తం మూడు భాగాల్లో తీయాలని నితీష్ ప్లాన్ చేసుకున్నారు.

క్యాస్టింగ్ ని అఫీషియల్ గా అనౌన్స్ చేయలేదు కానీ ఆల్రెడీఅంటూ చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. తాజాగా నటుడు తేజ సజ్జాను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ని సీక్వెల్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. తేజ సజ్జా తన నటనతో అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఆయన నివాసంలో సత్కరించారు.

ప్రతి టికెట్ నుంచి అయోధ్య రామమందిరానికి రూ.5 విరాళంగా ఇవ్వడం అభినందనీయమని ప్రశంసించారు. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం జనవరి 12న విడుదలై భారీ వసూళు సొంతం చేసుకుంటోంది. ఇప్పటివరకు రూ.100 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టింది. సూపర్ హీరో కథకు ఇతిహాసంతో ముడిపెట్టి.. నేటివిటీ మిస్ కాకుండా చూపించడంతో ప్రేక్షకులు ఈ సినిమాకు క్యూ కడుతున్నారు.

## కెనడాతో వివాదం.. ఆ దేశానికి వెళ్లే

# భారతీయ విద్యార్థుల్లో 86 శాతం తగ్గుదల

ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు భారతీయ ఏజెంట్లే కారణమంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ట్రూడో నిరాధార ఆరోపణలతో ఇరు దేశాల మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయి. తాజాగా భారతీయ విద్యార్థులకుఇచ్చే స్టడీ పర్మిట్ల సంఖ్యను కెనడా భారీగా తగ్గించింది. గతేడాది నాలుగవ త్రైమాసికంలో భారతీయ విద్యార్థులకు కెనడా జారీ చేసిన స్టడీ పర్మిట్ల సంఖ్య.. అంతక్రితం త్రైమాసికంతో పోల్చితే ఏకంగా 86 శాతం తగ్గుదల నమోదయింది. గతేడాది డిసెంబర్‌లో కెనడా జారీ చేసిన స్టడీ పర్మిట్లను కేవలం 14,910 మందికి మాత్రమే అనుమతులిచ్చినట్లు కెనడా ఇమ్మిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ తాజాగా తెలిపారు. అంతకుముందు త్రైమాసికంలో ఆ సంఖ్య 1,08,940గా ఉంది. గతంతో పోలిస్తే ఆ సంఖ్య దాదాపు 86 శాతానికి పడిపోయినట్లు మార్క్ చెప్పారు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకొనే భారతీయ విద్యార్థులు ఎక్కువగా అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, పలు యూరప్ దేశాల్లోని కాలేజీలను ఎంచుకొంటుంటారు. ఇక కెనడాలో



విద్యనభ్యసించడానికి వెళ్లే విదేశీ విద్యార్థుల్లో భారతీయులే సింహభాగం. కెనడా ఇమ్మిగ్రేషన్ విభాగం ప్రకారం.. 2022లో కెనడా జారీ చేసిన స్టడీ పర్మిట్‌లలో భారతీయ విద్యార్థుల వాటా ఏకంగా 41 శాతంగా ఉంది. 2022లో ఏకంగా 225,835 మంది భారతీయ విద్యార్థులకు స్టడీ పర్మిట్‌లు లభించాయి. అయితే ఖలిస్థాన్ ఉగ్రవాది హత్యతో కెనడా, భారత్ మధ్య ప్రస్తుతం తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో భారత విద్యార్థులు ప్రత్యామ్నాయాల కోసం అన్వేషిస్తున్నారు.

## హౌతీల స్థావరాలే లక్ష్యంగా

# అమెరికా నాలుగో దాడి

వాషింగ్టన్: ఇజ్రాయెల్- హమాస్ మధ్య ప్రారంభమైన పోరు క్రమంగా విస్తరిస్తోంది. రోజుకో దాడి, ప్రతిదాడులతో పశ్చిమాసియా ప్రాంతం అట్టుడుకుతోంది. తాజాగా యెమెన్‌లోని హౌతీ స్థావరాలే లక్ష్యంగా అమెరికా సైన్యం బుధవారం దాడులు చేసింది. ఎర్ర సముద్రం నుంచి యుద్ధ నౌకలు, జలాంతర్గాముల ద్వారా క్షిపణులు ప్రయోగించింది. రోజుల వ్యవధిలో ఇది నాలుగో దాడి. హౌతీలను తిరిగి అంతర్జాతీయ ఉగ్రవాదుల జాబితాలో చేరుస్తూ బుధవారం అగ్రరాజ్యం ప్రకటన చేసింది. దీంతో వారికి నిధుల సేకరణ కష్టతరంగా మారనుంది. ఇలా ప్రకటించిన కొన్ని గంటల వ్యవధిలోనే హౌతీ స్థావరాలను లక్ష్యంగా చేసుకొని యూఎస్ దాడులు చేసింది. గత శుక్రవారం అమెరికా, బ్రిటిష్ సేనలు తొలిసారి యెమెన్‌లో హౌతీల అధీనంలో ఉన్న దాదాపు 60 ప్రాంతాలపై బాంబులతో విరుచుకుపడ్డాయి. ఎర్రసముద్రంలో వాణిజ్య, యుద్ధ నౌకలపై చేస్తున్న దాడులను ఆపకపోతే మరిన్ని చర్యలు తప్పవని హెచ్చరించాయి. హౌతీలు మాత్రం అగ్రరాజ్య ఆదేశాలను బేఖాతరు చేస్తూ వరుస దాడులకు పాల్పడ్డారు.



బుధవారం అమెరికాకు చెందిన ఓ నౌకపై డ్రోన్ దాడి చేశారు. హౌతీలకు ఆయుధాల సరఫరాను ఆపేయాలని ఇరాన్‌ను సైతం అమెరికా హెచ్చరించింది. ఇరాన్ నుంచి క్షిపణుల విడిభాగాలతో యెమెన్‌కు వెళ్తున్న ఓ నౌకను అడ్డుకున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో ఎర్ర సముద్రం మీదుగా ప్రయాణిస్తున్న దాదాపు 50 దేశాలకు చెందిన నౌకల రక్షణ కోసం మరిన్ని సైనికపరమైన చర్యలు తప్పవని పెంటగాన్ మీడియా కార్యదర్శి ప్యాట్ రైడర్ తెలిపారు.

## భారత భూగర్భంలో సంఘర్షణ..

# పైకి పెరుగుతున్న హిమాలయాలు

శాన్‌ఫ్రాన్సిస్కో : పైన అంతా ప్రశాంతం.. లోలోపల అంతా సంఘర్షణబీ పైన మంచుతో చల్లని వాతావరణం.. లోలోపల భీకర వాతావరణం.. ఇదీ హిమాలయ పర్వత శ్రేణుల పరిస్థితి. హిమాలయాలు అన్న పేరు వినగానే మనసుకు హాయి. కానీ హిమాలయాల అంతర్భాగంలో భారీ యుద్ధమే జరుగుతు న్నదట. కారణం ఏమిటంటే.. భారత టెక్టొనిక్ ఫలకలో చీలిక వస్తుండటమే. యురేషియన్ టెక్టొనిక్ ఫలకతో నిత్య సంఘర్షణ ఫలితంగా హిమాలయ పర్వత శ్రేణులు మరింత ఎత్తుకు పెరిగి, ఆ ప్రాంతంలో ఉన్న టిబెట్ రెండు ముక్కలయ్యే అవకాశం ఉన్నది. శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన అమెరికన్ జియోఫిజికల్ యూనియన్ వార్షిక సమావేశంలో భూగర్భశాస్త్ర నిపుణులు భారత టెక్టొనిక్ ఫలక సంఘర్షణ ప్రభావాన్ని వివరించారు. భారత టెక్టొనిక్ ప్లేట్ ఏటా సుమారు 5 సెంటీమీటర్లు కదులుతున్నది. దీనివల్ల హిమాలయాల వెంబడి ఒత్తిడి ఎక్కువవుతున్నది. అది పెద్ద ప్రమాదానికి దారి తీసే అవకాశం లేకపోలేదని శాస్త్రవేత్తలు కొన్నేండ్లుగా హెచ్చరిస్తున్నారు. ‘ఏ క్షణమైనా హిమాలయ పర్వత శ్రేణుల్లో భారీ భూకంపం సంభవించే ప్రమాదం పొంచి ఉన్నది’ అని పేర్కొంటున్నారు. టెక్టొనిక్ ప్లేట్ల కదలిక ప్రభావమే హిమాచల్‌ప్రదేశ్, నేపాల్‌లో భూకంప ప్రభావం అని స్పష్టం చేస్తున్నారు. పురాతన ఖండం గోండ్వానాలో ఒక భాగం ఇది. 10



కోట్ల సంవత్సరాల క్రితం ఇతర శకలాల నుంచి భారత టెక్టొనిక్ ఫలక విడిపోయింది. ఉత్తరం వైపు కదులుతూ వచ్చింది. ప్రస్తుతం భారత ఉపఖండం, దక్షిణ చైనా, పశ్చిమ ఇండోనేషియాలో కొంత భాగం వరకు విస్తరించింది. ఇది 5 కోట్ల సంవత్సరాల నుంచి యురేషియన్ ఫలకను ఢీకొంటున్నది. దాని ప్రభావంతోనే హిమాలయ శ్రేణులు ఏర్పడ్డాయి. అయితే, ప్రస్తుతం ఈ ఫలక.. యురేషియన్ ఫలక వైపు ఏటా 5 సెంటీమీటర్ల మేర కదులుతూ, దాన్ని ఢీకొంటున్నది. దాంతో హిమాలయాలు మరింత ఎత్తు పెరిగి టిబెట్ ప్రాంతం రెండుగా విడిపోయే ప్రమాదానికి దారి తీస్తున్నది.

# ఆధార్ ఇక ప్రాథమిక గుర్తింపు పత్రం మాత్రమే.. తేల్చిచెప్పిన ఈపీఎఫ్ఓ

ఉద్యోగ భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) కీలక నిర్ణయం తీసుకున్నది. తమ సబ్‌స్క్రైబర్లు తమ జనన ధ్రువీకరణ కోసం సమర్పించే పత్రాల జాబితాలో ‘ఆధార్’ను తొలగించింది. ఇక నుంచి ఆధార్’ను ప్రాథమిక గుర్తింపు కార్డుగా మాత్రమే పరిగణిస్తామని తెలిపింది. భారత విశిష్ట ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈపీఎఫ్ఓ వెల్లడించింది. ఈపీఎఫ్ఓ సబ్‌స్క్రైబర్లు జనన ధ్రువీకరణ పత్రంగా సమర్పించడానికి ‘ఆధార్’ ప్రామాణికం కాదని ఈ నెల 16న జారీ చేసిన సర్క్యులర్‌లో సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ తెలిపారు. కనుక ఆధార్ ఆధారంగా తమ సబ్‌స్క్రైబర్ల పుట్టిన తేదీలో మార్పులు చేయలేమని ఈపీఎఫ్ఓ వెల్లడించింది. జనన ధ్రువీకరణ పత్రంగా పరిగణించలేమని పలు కేసుల్లో కోర్టులు తీర్పులు చెప్పాయి. దీంతో జనన, మరణాల రిజిస్ట్రార్ జారీ చేసిన జనన ధ్రువీకరణ పత్రం అందుబాటులో లేకపోతే ఈ పత్రాలను సమర్పించవచ్చునని సూచించింది.

- జననాలు, మరణాల రిజిస్ట్రార్ జారీ చేసే జనన ధ్రువీకరణ పత్రం,
- కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం, ప్రైవేట్ సర్వీస్ సంస్థల రికార్డుల ఆధారిత సర్టిఫికెట్,
- ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యా సంస్థ లేదా యూనివర్సిటీ జారీచేసే మార్కుల జాబితా,




- ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్ (పేరు, పుట్టిన తేదీ వివరాలు ఉంటే),
- స్కూల్ లేదా కాలేజీ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ),
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన పెన్షన్ పేమెంట్ సర్టిఫికెట్,
- ప్రభుత్వం జారీ చేసిన నివాస ధ్రువీకరణ పత్రం,
- పాన్ కార్డ్,
- పాస్ పోర్ట్,
- సివిల్ సర్జన్ జారీ చేసిన మెడికల్ సర్టిఫికెట్.

## ఉప్పు ప్రాణానికి ముప్పు.. పరిమితికి మించి

# వాడకంతో ఏటా 18.9 లక్షల మంది మృతి

జెనీవా:పరిమితికి మించి ఉప్పు వాడకంతో(రోజుకు 5 గ్రాములు మించి) మానవ ఆరోగ్యంపై ఊహించని స్థాయిలో నష్టం వాటిల్లుతున్నదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఆందోళన వ్యక్తం చేసింది. శరీరంలో కీలక అవయవాలు దెబ్బతిని ఏటా ప్రపంచవ్యాప్తంగా 18.9 లక్షల మంది చనిపోతున్నారని డబ్ల్యూహెచ్‌వో అంచనా వేసింది. రక్తపోటు, గుండె సమస్యలు, గ్యాస్ట్రిక్ క్యాన్సర్, స్థూలకాయం, కిడ్నీ వ్యాధులు బారినపడే అవకాశం పెంచుతుందని తెలిపింది. శరీరంలో ‘సోడియం’ కీలకమే అయినా, రోజుకు 2000 మిల్లీగ్రాములు మించి తీసుకోకూడదు.



## 2023లో 80 శాతానికి పైగా భారతీయ కంపెనీల్లో జీరో లేఆఫ్స్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రవేశంతో లక్షలాది మంది ఉద్యోగులకు తొలగింపు ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో.. 2023 లో 80 శాతం వరకు భారతీయ కంపెనీలు తమ ఉద్యోగులను తొలగించే ప్రక్రియ చేపట్టలేదు. హెచ్‌ఆర్ కన్సల్టింగ్ కంపెనీ మెర్సర్ నివేదిక ప్రకారం 2023లో కేవలం 22 భారతీయ కంపెనీలు మాత్రమే తమ ఉద్యోగులను తొలగించాయి గత ఏడాది 81% భారతీయ కంపెనీలు జీరో లేఆఫ్స్ ను నివేదించాయి. దాంతో మెజారిటీ భారతీయ మిడ్ సైజ్ సంస్థలు తమ పట్టును నిలుపుకున్నాయని, నియామకాల్లో కనీస తగ్గింపును అమలు చేశాయని స్పష్టమవుతోంది. ఐటీ సర్వీసెస్, కంప్యూటర్ సాఫ్ట్ వేర్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సెక్టార్ లకు చెందిన కంపెనీలు ఎక్కువగా 2023లో తమ ఉద్యోగులను తొలగించాయి. దేశవ్యాప్తంగా 20 వేర్వేరు పరిశ్రమలకు చెందిన 1,500 మందికి



పైగా హెచ్‌ఆర్ లీడర్ల నుంచి సమాచారాన్ని సేకరించి, ప్రస్తుత క్యాలెండర్ సంవత్సరంలో కూడా ఫ్రీలాన్సర్లను నియమించుకునే ధోరణి కొనసాగుతుందని ఈ నివేదిక తెలిపింది. గత ఏడాది 54% హెచ్ ఆర్ లు రిమోట్ వర్కర్లను నియమించుకున్నట్లు నివేదించాయి.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**